చురక

పదేళ్లుగా రాష్ట్రంలో
పరిపాలన అప్పులు
సామాన్యుల బ్రతుకులు
చక్కబడని తిప్పలు.

అభివృద్ధికి అప్పుచేసే
ఆలోచన కాదు తప్పు
రాబడి లేకుండా వడ్డీ
రాజుకుంటె పోదు ముప్పు

-వేల్పుల నారాయణ
9440433475


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com


## సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన రద్దు..!

హైదరాబాద్, డిసెంబర్ 21:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ్టి ఢిల్లీ పర్యటన రద్దయ్యింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల నేపథ్యంలో.. అందులో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీకి వెళ్లాల్సి ఉంది. అసెంబ్లీ సెషన్ నడుస్తుండడంతో ఇవాళ ఉదయం సభకు వచ్చిన సీఎం.. ఆ తర్వాత మధ్యాహ్నం స్పెషల్ ఫ్లైట్?లో ఢిల్లీకి బయల్దేరి వెళ్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. కానీ తాజాగా ఆ పర్యటన రద్దయ్యింది. ఇక సీడబ్ల్యూసీ శాశ్వత ఆహ్వానితుడిగా ఉన్న దామోదర రాజనర్సింహ, స్పెషల్ ఇన్వైటీ అయిన వంశీచంద్ రెడ్డి కూడా సమావేశాలకు హాజరు కానున్నారు. ఢిల్లీలోని ఏఐసీసీ ఆఫీస్?లో మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న ఈ భేటీలో.. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, రాబోయే లోక్ సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నట్టు తెలుస్తున్నది.


హైదరాబాద్ శుక్రవారం 22-12-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:114 పేజీలు:6 వెల: రూ.1/-


# విద్యుత్ రంగం అవకతవకలపై జ్యుడిషియల్ విచారణ-సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం ..



హైదరాబాద్, డిసెంబర్ 21: విద్యుత్ రంగంపై ఎలాంటి విచారణకైన సిద్ధమని జగదీష్ రెడ్డి చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అంతకు ముందు విద్యుత్ రంగంపై అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. దీనిపై చర్చ సందర్భంగా అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం కొగసాగింది. తమ గత ప్రభుత్వంపై ప్రస్తుత ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. తప్పులు జరినట్టు మీరు భావిస్తుంటే జ్యుడీషియల్ ఎంక్వైరీ చేయించాలని సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గౌరవ సభ్యుడే డిమాండ్ చేశారు కాబట్టి జ్యుడీషియల్ విచారణ జరిపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అసెంబ్లీ వేదికగా చెపుతున్నా. మూడు అంశాలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ వేయిస్తామని చెప్పారు.

విద్యుత్ రంగంలో చోటు చేసుకున్న అవకతవకలు రాష్ట్ర ప్రజలందరికీ తెలియజేయాలనే శ్వేతపత్రాన్ని విడుదల చేశామని రేవంత్ తెలిపారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టులో వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. మీ ఉద్దేశాలు ఏమిటో విచారణలో తేలుతాయని చెప్పారు. ఛత్తీస్ గఢ్ ప్రభుత్వంతో విద్యుత్ కొనుగోళ్లపై విచారణకు ఆదేశిస్తున్నామని తెలిపారు. కేంద్రం తక్కువ ధరకు విద్యుత్ ఇస్తున్నా అధిక ధరకు ఛత్తీస్ ఘడ్ ను విద్యుత్ కొనుగోళ్లకు ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. రెండో అంశంగా 1,080 మెగావాట్ల భద్రాద్రి పవర్ ప్రాజెక్ట్, మూడో అంశంగా యాదాద్రి పవర్ ప్రాజెక్టులపై విచారణకు కూడా ఆదేశిస్తున్నామని చెప్పారు.

ఇక తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, కరెంట్ అనే సెంటిమెంట్ ను గత ప్రభుత్వం ఆర్థిక అవసరాలకు వాడుకుందని రేవంత్ మండిపడ్డారు. ఛత్తీస్ గఢ్ నుంచి విద్యుత్ కొనుగోళ్లపై ఆనాడు ప్రశ్నించిన తమను అసెంబ్లీ నుంచి మార్షల్స్ చేత బయటకు గెంటించారని దుయ్యబట్టారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పని చేసిన విద్యుత్ నిపుణులను మారుమూల ప్రాంతాలకు బదిలీ చేశారని అన్నారు. 24 గంటల విద్యుత్ పంపిణీ చేశామని అబద్ధాలు చెపుతున్నారని విమర్శించారు.

ఆనాటి ప్రభుత్వం సభ ముందు ఏనాడూ వాస్తవాలు ఉంచలేదన్నారు. కరెంట్ అనే సెంటిమెంట్‌ను గత ప్రభుత్వం ఆర్థిక అవసరాలకు వాడుకుందన్నారు. విద్యుత్ శాఖను పూర్తి స్థాయిలో స్కానింగ్ చేసి ప్రజల ముందు వాస్తవాలు ఉంచుతామన్నారు

## రాష్ట్ర ఆర్థిక పురోగతిలో విద్యుత్ రంగానిది కీలకపాత్ర: భట్టి విక్రమార్క

హైదరాబాద్ డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. విద్యుత్ రంగంపై ప్రభుత్వం స్వల్పకాలిక చర్చను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. 30 పేజీల శ్వేతపత్రాన్ని సభ్యులకు అందించారు. ఔఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విద్యుత్ సరఫరా, ఉత్పత్తి గురించి తెలియజే యాలనే శ్వేతపత్రం విడుదల చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పురోగతిలో విద్యుత్ రంగం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. పరిశ్రమల అభి వృద్ధికి, వ్యవసాయ రంగం పురోగతికి నమ్మకమైన విద్యుత్ సరఫరానే వెన్నెముక అన్నారు. రవాణా, సమా చార రంగాలకు మనుగడకు విద్యుత్ సరఫరా చాలా ముఖ్యమని తెలిపారు. రాష్ట్ర ప్రజల నాణ్యమైన జీవనశైలి నూ చించేది కూడా విద్యుత్తేనని చెప్పారు.

## పార్టీ మారానంటూ మాట్లాడితే ఊరుకునేది లేదు - ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 21: తాను పార్టీ మారానంటూ అడ్డగోలుగా మాట్లాడితే ఊరుకునేది లేదని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హెచ్చరించారు. విద్యుత్ రంగం శ్వేతపత్రంపై ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ బీఆర్ఎస్ త్వరలో కనుమరుగవుతుందని జోస్యం చెప్పారు. ఇక ఆ పార్టీని బ్రహ్మదేవుడు కూడా కాపాడలేడన్నారు. తాను ప్రజల కోసమే పార్టీ మారానని, ఒక పార్టీకి రాజీనామా చేసిన తర్వాత మాత్రమే మరో పార్టీలో చేరానని స్పష్టం చేశారు. అలాంటప్పుడు తాను పార్టీ మారానం టూ ఇష్టారీతిన మాట్లాడితే ఊరుకునేది లేదని మండిపడ్డారు.

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకుందని, అభివృద్ధి పేరిట వేలాది కోట్ల రూపాయలు దోచుకున్న చరిత్ర ఆ పార్టీదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ సభ్యులు నిత్యం పార్టీ మార్పుపై విమర్శలు చేస్తున్నారని వాపోయారు. అసలు జగదీశ్ రెడ్డికి వేలాది కోట్ల రూపాయల బంగ్లాలు ఎలా వచ్చాయో చెప్పాలని నిలదీశారు. బీఆర్ఎస్ అహంకారం చూసిన ప్రజలు ఆ పార్టీని ఓడించి బుద్ధి చెప్పారన్నారు. కానీ ప్రతిపక్ష పార్టీకి ఇంకా బుద్ధి రాలేదని, అందుకే తమను పార్టీ మారినట్లు పదేపదే అంటున్నారని విమర్శించారు.

మరి కేసీఆర్ ఏ పార్టీలో రాజకీయ జీవితం ప్రారంభించారు? ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి ఎలా వచ్చారు టీఆర్ఎస్ ఎలా స్థాపించారు అంటే కేసీఆర్‌ది మూడు పార్టీలు మారిన చరిత్ర అని ఆయన విమర్శలు గుప్పించారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ నేతలు మరిచిపోవద్దని హితవు పలికారు. నేను మరో పార్టీలోకి వెళ్లి, తిరిగి కాంగ్రెస్ లోకి వచ్చానంటే మీకు మా పార్టీ అధికారంలోకి వస్తుందని అర్థం కాలేదా.. నేను పార్టీ మారాక.. మీరు ప్రతిపక్షంలోకి వెళ్లిన విషయం గుర్తుంచుకోవాలి అన్నారు.

# సాగునీటి రంగంపై రేవంత్ సమీక్ష... ప్రాజెక్ట్‌ల వివరాలు ఇవ్వాలని ఆదేశం



హైదరాబాద్, డిసెంబర్ 21:.ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన మార్గదర్శకాలు ప్రజలకు తెలియజేసేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని రకాల లెక్కలు పూర్తిగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలియకుండా దాచిపెట్టే ప్రయత్నం చేయొద్దని ఒకవేళ అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. గురువారం తన నివాసంలో వ్యవసాయ, నీటి పారుదల రంగాలపై మంత్రులు తుమ్మల, ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ప్రభుత్వంలో ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉండాల్సిందేనన్న ఉద్దేశంతో ప్రతి అంశాన్ని ప్రజలకు విడమరచి చెబుతున్నా మన్నారు. ఈ విషయంలో అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి నిజాలను ప్రజలకు వివరించాలన్నారు. 1956 నుంచి 2014 వరకు, 2014 నుంచి 2023 వరకు నిర్మించిన ప్రాజెక్టులు, వాటి నిర్మాణ వ్యయాలు, ప్రాజెక్టుల వారీగా సాగులోకి తెచ్చిన ఆయకట్టు వివరాలను అధికారుల ద్వారా సీఎం తెలుసుకున్నారు. రాష్ట్రంలోని సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి పూర్తి స్థాయి నివేదిక అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

# పెట్టుబడులు పెట్టడానికి వచ్చే కంపెనీలకు అన్ని విధాల సహకరిస్తాం

### – ఆటా & CII బిజినెస్ సెమినార్లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్ డిసెంబర్ 21:(ఎక్స్ ప్రెస్ న్యూస్ ); తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చే కంపెనీలకు అన్నివిధాల సహకరిస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ టీ హబ్ లో ఆటా వేడుకల్లో భాగంగా ఆటా మరియు అఎఎ ఆధ్వర్యంలో నిర్వహించిన బిజినెస్ సెమినార్ కార్యక్రమానికి హైదరాబాద్ ఎంబసీ యు.ఎస్ కాన్సోల్ జనరల్ మిస్ జెన్నిఫర్ లార్సన్ తో కలిసి మంత్రి ఉత్తమ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... పెట్టుబడులు పెట్టడానికి వచ్చే కంపెనీలకు ఎర్ర తివాచీ పరిచి తెలంగాణ ప్రభుత్వం స్వాగతం పలుకుతుంది అని అన్నారు. అలాగే వారికి ఏ సమస్యలున్నా తీర్చే బాధ్యత మాదేనని అన్నారు. ఆటతో తనకు మంచి అనుబంధం వుందని, మంచి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఆటా, అఎఎ వాళ్ళను అభినందిస్తున్నాను అన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన హైదరాబాద్ ఎంబసీ యు.ఎస్ కాన్సోల్ జనరల్ మిస్ జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ.... అమెరికాలో తెలుగు వారు ఎక్కువగా వున్నారని, వారికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆటా కార్యక్రమానికి రావడం ఆనందంగా ఉందని అన్నారు. అలాగే అమెరికా లో తెలుగు వారు చాలా ఉన్నతంగా ఎదిగారని అన్నారు. హైదరాబాద్, అమెరికా మధ్య సంధానకర్తగా ఆటా వ్యవహరించడం అభినందనీయం అన్నారు. హైదరాబాద్ కు అమెరికా నుండి పెట్టుబడులు రావడానికి తన వంతు కృషి చేస్తాం అన్నారు. ఆటా అధ్యక్షురాలు మధు బొమ్మినేని మాట్లాడుతూ....ఆటా వేడుకల్లో భాగంగా ఈ బిజినెస్ సెమినార్ ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సెమినార్ తెలంగాణ, అమెరికా మధ్య సంబంధాలు మరింత పెంపొందించడానికి ఉపయోగపడతాయి అని ఆశాభావం వ్యక్తం చేశారు. 2024 జూన్ 7,8,9 లలో నిర్వహించే ఆటా మహాసభలకు అతిథిగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని రమ్మని ఆహ్వానించారు. అఎఎ అధ్యక్షులు శేఖర్ రెడ్డి మాట్లాడుతూ....ఆటా వారితో ఈ సెమినార్ ని సంయుక్తంగా చేయడం తమకు ఆనందంగా వుందన్నారు. ఈ అనుబంధం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. ఆటా వేడుకల చైర్, ఎలెక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చల్లా మాట్లాడుతూ.... పెట్టుబడి పెట్టడానికి వచ్చే కంపెనీలకు తెలంగాణ ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటా వేడుకల కో చైర్ వేణు సంకినేని, ఆటా సెక్రెటరీ రామకృష్ణారెడ్డి అల, ఆటా కోశాధికారి సతీష్ రెడ్డి, ఆటా కన్వెన్షన్ కన్వీనర్ కిరణ్ రెడ్డి పాశం, 18వ ఆటా కాన్ఫరెన్స్ నేషనల్ కో ఆర్డినేటర్ సాయి సుధిని, ఆటా జాయింట్ సెక్రటరీ రవీందర్ గూడూరు, బిజినెస్ కో చైర్ రామ్ మట్టపల్లి, లక్ష్ చేపురి,హరీశ్ బత్తిని, మీడియా కో ఆర్డినేటర్ ఈశ్వర్ బండా, పాస్ట్ ప్రెసిడెంట్ పరమేష్ భీమ్ రెడ్డి, ఆటా బోర్డు ఆఫ్ ట్రస్టీస్ నరసింహారెడ్డి ద్యాసాని, కిషోర్ గూడూరు తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో వాడీ వేడీ చర్చ

### –ప్రాజెక్టులో జగదీశ్ రెడ్డి 10 వేల కోట్లు తిన్నారు: మంత్రి కోమటిరెడ్డి
### –ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో లేదా కమిషన్‌తో విచారణ జరిపించాలి
### – బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

హైదరాబాద్ డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణలో విద్యుత్ రంగంపై శాసనసభలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మధ్య వాడీ వేడీ చర్చ జరిగింది. ముందుగా యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో పెద్ద కుంభకోణం జరిగిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఇందులో 10 వేల కోట్లను జగదీశ్ రెడ్డి తిన్నారని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై జగదీశ్ రెడ్డి ధీటుగా స్పందించారు. కోమటిరెడ్డి చేసిన ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో లేదా కమిషన్‌తో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని జగదీశ్ రెడ్డి కోరారు. ఆ విచారణలో దోషులు దొరికితే వాళ్లకు శిక్ష వేయాలన్నారు. లేదంటే ఆధారాలు లేకుండా అసంబద్ధ ఆరోపణలు చేసిన వారికి శిక్ష పడాలన్నారు. తప్పకుండా ఈ విషయం తేలాలని అన్నారు. ఇటువంటివి చాలా సందర్భాల్లో బయట మాట్లాడుతుంటే విన్నానని.. కానీ ఏ ఒక్కరోజు కూడా రియాక్ట్ కాలేదని చెప్పారు. ఇవన్నీ పనికిమాలిన మాటలు.. అర్థం లేని.. ఆధార రహితమైన మాటలు అని అన్నారు. ఇవన్నీ రికార్డుల్లోకి రావాలనే ఇన్ని రోజులు వెయిట్ చేశానని.. ఇవాళ



రికార్డుల్లోకి వచ్చాయని అన్నారు. దీనిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. మూడు అంశాలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ చేసేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఆ విచారణతో పాటు.. కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన ఆరోపణలపై కూడా విచారణ చేయాలన్నారు. వారు చేసిన ఆరోపణలు అసంబద్ధమైతే తప్పకుండా శిక్ష పడాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించారు. అది మీరు చేయగలుగుతారా ప్రజా కోర్టులో తేలుస్తామా అనేది చూడాలన్నారు

# మరోసారి కలకలం సృష్టిస్తున్న కరోనా

హైదరాబాద్ డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); కరోనా మరోసారి కలకలం సృష్టిస్తున్నది. రాష్ట్రంలో నిన్న ఒక్కరోజే నాలుగు కరోనా కేసులు నమోదయ్యాయి. చాలాకాలం తర్వాత మళ్లీ కరోనా బులెటిన్ విడుదల చేయడం గమనార్హం. దేశంలో ఈసరికే ఐదుగురు కరోనా సోకి మరణించినట్టు వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో సహజంగానే ఇది ఆందోళన కలిగిస్తున్నది. ప్రస్తుతం జేఎన్-1 అనే కొత్తరకం కరోనా వైరస్ విజృంభిస్తున్నట్టు తెలుస్తున్నది. అమెరికా, చైనాలో దీనివల్ల కరోనా కేసులు పెరుగుతున్నాయి. ఇప్పుడు భారత్‌లో జేఎన్-1 కేసులు నమోదు కావడం కలవరపరిచే చర్యగానే భావించాలి. డిసెంబర్ 8న ఈ వైరస్ మొదటిసారిగా కేరళలో బయటపడింది. అక్కడ ఈసరికే కేసుల సంఖ్య వేగంగా రెండు వేల వైపు పరుగులు తీస్తున్నది. ముగ్గురు లేదా నలుగురు మరణించినట్టు వార్తలు వెలువడ్డాయి. కర్ణాటకలో, యూపీలో ఒక్కొక్కరు మరణించడం రెండు విషయాలను తెలియజేస్తున్నది. ఒకటి వైరస్ వేగంగా దేశంలోని నలుమూలలకు పాకుతుండటం, రెండు వైరస్ వల్ల ప్రాణాలు పోతుండటం. శీతాకాలం కావడం వల్ల శ్వాసకోశ సంబంధ ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. కరోనాపై కఠినమైన నిఘా అమలుచేయాలని, పరీక్షలను పెంచాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది. తీవ్రతను అర్థం చేసుకున్న కేంద్రం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. తెలంగాణ ప్రభుత్వం ఆ మేరకు స్పందించి ప్రజలకు హెచ్చరికలు జారీచేసి దవాఖానల్లో ఐసోలేషన్ బెడ్లు కూడా సిద్ధం చేయించింది.

మాస్కులు ధరించడం, భౌతిక దూరం, చేతుల శుభ్రత వంటివి పాటించాలని, జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యపరీక్షలు చేయించు కోవా లని మార్గదర్శకాలు జారీచేసింది.

గతంలో దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు తమ కుటుంబ సభ్యులను, సన్నిహితులను కోల్పోయి ఉంటాయి. అయినా ఇటీవలి కాలంలో ప్రజల్లో కరోనా భయం క్రమంగా తగ్గుతూ వచ్చింది. కరోనా కల్లోలం నుంచి తేరుకొని ప్రపంచం ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్నది. కరోనా అంటే ఒకరకమైన అలసత్వం, విసుగూ రెండూ వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో కొవిడ్ కొత్త అవతారాలు ఎత్తుతూ వ్యాపిస్తుండటం, స్వల్పసంఖ్యలో అయినా మరణాలకు కారణమవుతుండటం తేలికగా తీసుకునే విషయమైతే కాదని ప్రజలు గుర్తించాలి. కరోనా ముందు, కరోనా తర్వాత అనే కాల విభజనను గుర్తుంచుకోవాలని నొక్కిచెప్పాల్సిన అవసరం లేదు. సంపన్న, బీద దేశాలనే తేడా లేకుండా లక్షల సంఖ్యలో ప్రజలు మరణించడం, కొన్ని దేశాల ఆర్థికవ్యవస్థలు అతలాకుతలమై కుప్పకూలిపోవడం మనం చూశాం.

ఇప్పటివరకు మొత్తం మరణాల సంఖ్య 70 లక్షలకు చేరుకున్నదన్న సంగతి మరిచిపోరాదు. ముప్పు చాలావరకు తగ్గినప్పటికీ పూర్తిగా పోలేదని ప్రస్తుత పరిణామా లు సూచిస్తున్నాయి. ప్రస్తుత కరోనా రకం మహమ్మారి స్థాయికి విస్తరించనప్పటికీ జాగ్రత్తలు తప్పనిసరి. కరోనా చికిత్స శ్రమదమాదులతో కూడుకున్నది కనుక చికిత్స కన్నా నివారణే మేలన్న సూక్తి అందరికీ శిరోధార్యం.

## విపక్ష ఎంపీలపై కొనసాగుతున్న సస్పెన్షన్లు.. మరో ముగ్గురు ఎంపీలపై వేటు

న్యూ ఢిల్లీ డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );శీతాకాల సమావేశాల్లో విపక్ష ఎంపీలపై సస్పెన్షన్లు కొనసాగుతున్నాయి. తాజాగా మరో ముగ్గురు ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. కాంగ్రెస్ ఎంపీలు దీపక్ బైజ్, నకుల్ నాథ్, డీకే సురేశ్‌లను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో ఎగువ, దిగువ సభల నుంచి సస్పెండ్ అయిన ఎంపీల సంఖ్య 146కి చేరింది. ఈ శీతాకాల సెషన్ మొత్తానికి వారిని సస్పెండ్ చేశారు. పార్లమెంట్ చరిత్రలో ఒక సెషన్‌లో ఇంతమందిపై వేటువేయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.కాగా, డిసెంబర్ 13న లోక్‌సభలో జరిగిన భద్రతా ఉల్లంఘన ఘటన పార్లమెంట్‌ను కుదిపేస్తున్న విషయం తెలిసిందే. ఘటనపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటన చేయాలని ఉభయసభల్లో ప్రతిపక్ష ఎంపీలు పట్టుబడుతున్నారు. అయితే ఆందోళన చేపడుతున్న విపక్ష ఎంపీలపై కేంద్ర ప్రభుత్వం సస్పెన్షన్ కొరడా ఝుళిపిస్తున్నది. వరుసగా ఎంపీలను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేస్తున్నది. ఈ క్రమంలో ఎగువ, దిగువ సభల నుంచి ఇప్పటి వరకూ మొత్తం 146 (తాజా సస్పెన్షన్‌తో కలిపి) మంది ఎంపీలను సస్పెండ్ చేసింది. ఈ నెల 14న 14 మంది ఎంపీలు సస్పెండ్ అయ్యారు.

# రాష్ట్రపతి నిలయం ఆవరణలో120 అడుగుల ఫ్లాగ్ పోస్ట్ ను ఆవిష్కరించిన రాష్ట్రపతి





హైదరాబాద్ డిసెంబర్ (ఎక్స్ ప్రెస్ న్యూ స్);బొల్లారం రాష్ట్రపతి నిలయం ఆవరణలో ఏర్పాటుచేసిన 120 అడుగుల ఫ్లాగ్ పోస్ట్ ను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఆవిష్కరించారు.

1948 లో హైదరాబాద్ రాష్ట్రం భారత దేశంలో విలీనం అయిన సందర్భంగా ఇక్కడే నిర్వహించిన వేడుకల్లో ప్రిన్స్ ఆజాం షా నుంచి హైదరాబాద్ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా భారత ప్రభుత్వంచే నియమితులైన MK Vellodi బాధ్యతలు స్వీకరిస్తూ, 120 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించారు. దాని స్థానంలో అదే విధంగా నూతనంగా ను గౌరవ రాష్ట్రపతి ప్రారంభించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ రాష్ట్ర మంత్రివర్యులు డి అనసూయ ( సీతక్క) పాల్గొన్నారు.

# విద్యుత్‌పై అక్బరుద్దీన్, రేవంత్ మధ్య మాటల యుద్ధం..

హైదరాబాద్, డిసెంబర్ 21:తెలంగాణ శాసన సభలో విద్యుత్‌పై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మజ్లిస్ పార్టీ నేత అక్బరుద్దీన్ ఒవైసీ మధ్య వాగ్యుద్ధం నడిచింది. అక్బరుద్దీన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో పాతబస్తీ అభివృద్ధి చెందిందని ఒవైసీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. తాము కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణంగా సపోర్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ ముందుందని, దేశ సగటు కంటే ఎక్కువగా ఉందని వ్యాఖ్యానించారు.

ఈ దశలోనే సీఎం రేవంత్ రెడ్డి ఏబీవీపీ, టీఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెస్, ఆరెస్సెస్ అంటూ విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. తాను మజ్లిస్ గురించి మాట్లాడాలంటే చాలా మాట్లాడుతానన్నారు. నాదెండ్ల.. ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఆర్, కిరణ్ కుమార్ రెడ్డి, నిన్నటి వరకు కేసీఆర్ ఇలా అందరితో దోస్తీ చేశారని గుర్తు చేశారు. ఎవరు ఎక్కడి నుంచి వచ్చారో చర్చిద్దామంటే సిద్ధమని, మజ్లిస్ ఎక్కడి నుంచి వచ్చిందో చర్చిద్దాం రండి అన్నారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్, మజ్లిస్ పార్టీలు కలిసి పని చేశాయని రేవంత్ రెడ్డి ఆరోపించారు. నిజామాబాద్ అర్బన్‌లో షబ్బీర్ అలీని, జూబ్లీహిల్స్‌లో అజారుద్దీన్‌ను ఓడించేందుకు కేసీఆర్‌తో కలిసి మజ్లిస్ పని చేసిందని విమర్శించారు. అదే మజ్లిస్ పార్టీ సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలలో ఎందుకు పోటీ చేయలేదు.. అని నిలదీశారు. కానీ తమ పార్టీ కాంగ్రెస్ మైనార్టీ ముఖ్యమంత్రులను, మైనార్టీ రాష్ట్రపతులను చేసిందని వ్యాఖ్యానించారు. మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు.

అక్బరుద్దీన్.. కేసీఆర్‌కు మిత్రుడు కావొచ్చు.. మోదీకి మద్దతివ్వవచ్చు.. అది వాళ్లిష్టం.. కానీ తమకు పాత బస్తీ, కొత్త బస్తీ అనే తేడాలు లేవన్నారు. పాతబస్తీని అభివృద్ధి చేస్తామన్నారు. మజ్లిస్, బీఆర్ఎస్ మిత్రపక్షాలు అని కేసీఆర్ పలుమార్లు చెప్పారని గుర్తు చేశారు. అక్బరుద్దీన్ ఎంతసేపు మాట్లాడినా ఇబ్బంది లేదని, ఆయన ఆరుసార్లు గెలిచారని, అందుకే ప్రొటెం స్పీకర్‌గా అవకాశం ఇచ్చామని రేవంత్ రెడ్డి చెప్పారు. మజ్లిస్ పార్టీ కేసీఆర్‌ను రక్షించేందుకు ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కోనవేమెవో.. కరెంట్ కోసం ఆందోళనలు జరగడం లేదని చెబుతున్నారని విమర్శించారు. అక్బరుద్దీన్ ముస్లింలందరికీ నాయకుడు కాదని ఆయన కేవలం మజ్లిస్ పార్టీకి మాత్రమే నాయకుడని చురక అంటించారు.

అక్బరుద్దీన్ అన్ని విషయాలు చెబుతున్నారు కానీ పాతబస్తీలో విద్యుత్ బకాయిలు చెల్లింపులు జరిగేలా చూసే బాధ్యత తనది అని మాత్రం చెప్పడం లేదని రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. విద్యుత్ మొండి బకాయిల్లో సిద్దిపేట, గజ్వేల్ టాప్‌లో ఉన్నాయన్నారు. శ్రీశైలం ఎడమ కాలువ సొరంగం బ్లాస్ట్ అయి ఎనిమిది మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో ఫాతిమా అనే ముస్లిం ఉంటే మజ్లిస్ పార్టీ కనీసం ఆమె గురించి మాట్లాడలేదన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతుండగా మజ్లిస్ సభ్యులు వెల్‌లోకి దూసుకు వచ్చే ప్రయత్నం చేశారు. దీనిపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో వెనక్కి తగ్గారు.

వేం ఎవరికీ భయపడం.. అక్బరుద్దీన్

రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై అక్బరుద్దీన్ తీవ్రంగా స్పందించారు. తాము ఎవరికీ భయపడబోమని, కిరణ్ కుమార్ రెడ్డి జైల్లో పెట్టినా భయపడలేదన్నారు. కాంగ్రెస్ తమను అణచివేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాతబస్తీలో విద్యుత్ చౌర్యం అంటున్నారా.. విద్యుత్ బకాయిలు అంటున్నారా? చెప్పాలన్నారు. ఇక తమను ఆయా చోట్ల పోటీ చేయలేదని ఆయన ప్రశ్నిస్తున్నారని, ఎక్కడ పోటీ చేయాలనేది తమ ఇష్టమన్నారు. షబ్బీర్ అలీని ఓడించేందుకు ప్రయత్నించామని చెబుతున్నారని, తాము నిజామాబాద్ అర్బన్‌లో పోటీయే చేయలేదన్నారు.

నేటి కందం– నేటికి అందం

మిక్కుటమగు మక్కువతో
నెక్కువ చలిపెట్టునట్టి ఈ దివసంబున్
"తక్కువ పగలును గలిగిన
చక్కని దిన"మనుచు ప్రజలు జరిపెదరు వెసన్

(డిసెంబరు 22 : సంవత్సరంలో తక్కువ
పగలు గలిగిన దినం)



-రాధశ్రీ
సెల్:9494481210

# అసాధారణ ప్రతిభావంతురాలు డా: నీనా గుప్తా

## (22 ఫిబ్రవరి 'జాతీయ గణితశాస్త్ర దినోత్సవం' సందర్భంగా)

డిగ్రీ వరకు చదివి, పెళ్లి చేసుకొని జీవితాన్ని సాధారణ గృహిణిగా గడపాలనుకున్న ఓ మధ్య తరగతి భారత మహిళ నీనా గుప్తాలోని గణితశాస్త్ర అపార జ్ఞానం తన కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో గణితంలో ఉన్నత చదువులు పూర్తి చేయడం, ఐయస్ఐలో డాక్టరేట్ అందుకోవడంతో పాటు అక్కడే ఆచార్యురాలిగా సేవలందిస్తూ ప్రపంచ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్తగా గుర్తింపు పొందడం నేటి భారతీయ యువతకు ప్రేరణాత్మకం.

### నీనా గుప్త గణిత ప్రతిభ అసాధారణం:

బీజ గణిత జ్యామితి రంగంలో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన 38-ఏండ్ల వయసుగల డా: నీనా గుప్తా తాజాగా ప్రతిష్ఠాత్మక 'డియస్‌టి-ఐసిటిపి-ఐయంయు రామానుజన్ ప్రైజ్-2021' పురస్కారానికి కూడా ఎంపిక కావడం భారతీయులకు గర్వకారణంగా నిలుస్తున్నది.

2005 నుంచి నేటి వరకు రామానుజన్ పురస్కారాన్ని అందుకున్న 4వ భారతీయ గణిత శాస్త్రవేత్తగా, 3వ భారత మహిళగా నీనా గుప్తా ప్రత్యేక గుర్తింపు పొందడం హర్షదాయకం.

ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ (ఐయస్ఐ) కోల్‌కతాలో ఆచార్యురాలిగా విశేష సేవలు అందిస్తున్న డా: నీనా గుప్తా అతి చిన్న వయస్సు గల విజేతగా నిలిచింది. బీజగణిత జ్యామితి రంగంలో నీనా గుప్తా చేసిన పరిశోధనలలో భాగంగా అసాధారణ 'జరిస్కీ క్యాన్సిలేషన్ ప్రాబ్లమ్'కు సమాధానాన్ని సవివరంగా వివరించి ప్రపంచ గణిత శాస్త్రజ్ఞుల దృష్టిని ఆకర్షించి, వారి మన్ననలు పొందగలిగిన భారతీయ మహిళా గణిత శాస్త్రవేత్తగా పేరు తెచ్చుకుంది. ఇప్పటి వరకు డా: నీనా గుప్తాలతో కలిపి ముగ్గురు ఐయస్ఐ శాస్త్రవేత్తలకు రామానుజన్ పురస్కారం వరించడం విశేషంగా చెప్పవచ్చు.

### నీనా గుప్తను వరించిన పురస్కారాలు:

కలకత్తాలో జన్మించిన నీనా గుప్తా ఖల్సా హైస్కూల్‌లో పాఠశాల విద్య, బెతూనే కళాశాలలో బియస్‌సి మ్యాథ్స్(2006), నేషనల్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్‌లో ఏకైక మహిళగా యంయస్‌సి(2008), ఆచార్య ఏ కే దత్తా పర్యవేక్షణలో పిహెచ్‌డి (2011) పూర్తి చేశారు.

డా: నీనా గుప్తా గణితశాస్త్ర కృషికి స్పందించిన ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ గణిత శాస్త్ర సమాజం 'యంగ్ సైంటిస్టు అవార్డు-2014' అందించింది.

2019లో శాంతి స్వరూప్ భట్నాగర్ పురస్కారం, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ విజిటింగ్ ప్రొఫెసర్, సరస్వతీ కౌసిక్ పతకం-2013, అబ్దస్ సలామ్ రామానుజన్ బహుమతి-2021, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ రీసెర్చ్ ఫెల్లోషిప్-2008, స్వర్ణ జయంతి ఫెల్లోషిప్ అవార్డు-2015, మద్రాస్ యూనివర్సిటీ రామానుజన్ ప్రైజ్-2014 లాంటి పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పురస్కారాలతో పాటు గణితశాస్త్ర పరిశోధనా వ్యాసాలను మన డా నీనా గుప్తా రచించగలగడం విశేషం.

బీజగణిత జ్యామితిలో ప్రపంచ గణిత శాస్త్రవేత్తలకు 1949 నుంచి గత 70-ఏళ్ళగా సవాలుగా నిలిచిన 'జరిస్కీ క్యాన్సిలేషన్ ప్రాబ్లమ్'ను సశాస్త్రీయంగా 2014లోనే పరిష్కరించిన మహా మేధావి మన నీనా గుప్తా అని ప్రకటించడం భారతీయులకే కాకుండా అంతర్జాతీయ గణిత శాస్త్ర సమాజానికి కూడా శ్రీనివాస రామానుజన్ అయ్యర్ వారసురాలిగా గర్వకారణంగా నిలిచింది.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ఇండియన్ స్పేస్ స్టార్టప్‌లలో పెట్టుబడి వి124.7 మిలియన్లకు పెరిగింది: డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 21:డిపిఐఐటి స్టార్ట్-అప్ ఇండియా పోర్టల్ ప్రకారం 2014లో కేవలం 1 స్పేస్ స్టార్టప్‌ల సంఖ్య 2023లో 189కి పెరిగిందని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈరోజు తెలిపారు. 2023లో ఇండియన్ స్పేస్ స్టార్టప్‌లలో పెట్టుబడి 124.7 మిలియన్ డాలర్లకు పెరిగిందని ఆయన తెలిపారు.

కేంద్ర రాష్ట్ర మంత్రి (స్వతంత్ర బాధ్యత) సైన్స్ & టెక్నాలజీ; పీఎంవో, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్, అటామిక్ ఎనర్జీ అండ్ స్పేస్ ఈరోజు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ యొక్క ప్రస్తుత పరిమాణం సుమారు వి8.4 బిలియన్లు (ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ఇది దాదాపు 2-3%) అంచనా వేయబడింది మరియు భారత అంతరిక్ష విధానం 2023 అమలుతో, 2033 నాటికి వి44 బిలియన్ల భారతీయ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ కు చేరగలదని అంచనా. ఆశించిన ఆర్థిక వ్యవస్థను సాధించడంలో ప్రైవేట్ రంగం పాత్ర ప్రధానం. శాటిలైట్ తయారీ, లాంచ్ వాహనాల తయారీ, ఉపగ్రహ సేవలను అందించడం మరియు గ్రౌండ్ సిస్టమ్‌ల తయారీలో ప్రైవేట్ రంగం స్వతంత్రంగా సమగ్ర పరిష్కారాన్ని అందించగలదని భావిస్తున్నారు.

ప్రత్యేక సమాధానంలో, డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, ప్రస్తుతం, ఉపగ్రహ స్థాపన మరియు కార్యకలాపాల కోసం ప్రభుత్వ మార్గంలో అంతరిక్ష రంగంలో ఎఫ్‌డిఐని అనుమతించారు. అంతరిక్ష రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డిఐ) ప్రోత్సహించేందుకు డిపిఐఐటితో సంప్రదించి అంతరిక్ష శాఖ ఎఫ్‌డిఐ పాలసీ మార్గదర్శకాలను సమీక్షించే పనిలో ఉందని ఆయన చెప్పారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, కొన్ని ప్రభుత్వేతర సంస్థలు (ఎన్ జీ ఈ లు) వారి స్వంత ఉపగ్రహాలను ప్రయోగించాయి. అనేక ఇతర అంతరిక్ష పరిశ్రమలు మరియు స్టార్ట్-అప్‌లు కూడా తమ స్వంత ఉపగ్రహాలు మరియు సముదాయాలను నిర్మిస్తున్నాయి. ఈ ఉపగ్రహాలు వ్యవసాయం, విపత్తు నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణ మొదలైన ప్రయోజనాలకు దోహదం చేస్తాయి.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, ఒక ఎన్‌జిఇ తమ సబ్-ఆర్బిటల్ లాంచ్ వెహికల్‌ను ప్రారంభించగా, ఇస్రో క్యాంపస్‌లో ప్రైవేట్ లాంచ్‌ప్యాడ్ మరియు మిషన్ కంట్రోల్ సెంటర్‌ను ఎన్‌జిఇ మొదటిసారిగా ఏర్పాటు చేసింది. ఆ ఎన్ జీ ఈ ల ద్వారా ఉప కక్ష్య ప్రయోగం త్వరలో షెడ్యూల్ చేయబడింది. ప్రభుత్వం అంతరిక్ష రంగం విధానం 2023ని ప్రకటించింది, ఇది అంతరిక్ష కార్యకలాపాల యొక్క అన్ని రంగాలలో ఎన్‌జిఇల సంపూర్ణ భాగస్వామ్యాన్ని అనుమతిస్తుంది. డాక్టర్ జితేంద్ర సింగ్ అంతరిక్ష రంగంలో ఈ క్రింది ఇతర పరిణామాలు మరియు ప్రభావాన్ని వివరించారు:

ప్రైవేట్ కంపెనీలు శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్ పరిష్కారాలను అన్వేషిస్తున్నాయి. ప్రైవేట్ కంపెనీలు అంతరిక్ష ఆధారిత అప్లికేషన్‌లు మరియు సేవలలో ఎక్కువగా పాల్గొంటున్నారు. ప్రైవేట్ రంగంలో శాటిలైట్ అనుసంధానం మరియు టెస్టింగ్ సౌకర్యాలు వస్తున్నాయి.

శాటిలైట్ సబ్‌సిస్టమ్‌లు మరియు గ్రౌండ్ సిస్టమ్‌ల స్థానిక తయారీని ప్రైవేట్ రంగం చేస్తోంది. భారతీయ ప్రైవేట్ అంతరిక్ష సంస్థలు అంతర్జాతీయ అంతరిక్ష సంస్థలు మరియు సంస్థలతో సహకారాలు మరియు భాగస్వామ్యాలు ఎక్కువగా నేరుపుతున్నాయి.

దేశంలోని వెనుకబడిన ప్రాంతాలకు చేరుకోవడంలోవిద్యా రంగంతో పాటు యువ స్టార్టప్‌లకు చేయూత, ఆవరణ మద్దతు మరియు పెట్టుబడి ద్వారా ఈ క్రింది ప్రయత్నాలు జరుగుతున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు. భారతదేశంలోని విద్యాసంస్థలలో అంతరిక్ష సాంకేతిక విద్య ను చేర్చడాన్ని సులభతరం చేయడం మరియు ప్రోత్సహించడం, అవగాహన, నైపుణ్యాభివృద్ధి మరియు పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యంతో భారతదేశంలో అంతరిక్ష సాంకేతిక విద్యను స్వీకరించడానికి జాతీయ కమిటీని ఇన్ - స్పేస్ ను ఏర్పాటు చేసింది.

రిటైర్డ్ ఇస్రో సబ్జెక్ట్ నిపుణుల జాబితా ఇన్-స్పేస్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ లో ప్రచురించబడింది. నిపుణుల సలహాల కోసం ఎన్ జీ ఈలు నేరుగా ఈ మెంటార్‌లను సంప్రదించవచ్చు. అంతరిక్ష రంగంలో అనుభవం ఉన్న టెక్నోక్రాట్‌లను మెంటార్‌లుగా క్రమానుగతంగా ఆహ్వానించి మరియు వారిని ఎన్ జీ ఈలకు కనెక్ట్ చేయడం విద్యార్థులు/ విద్యాసంస్థలు అంతరిక్ష కార్యకలాపాలను నిర్వహించేలా ప్రోత్సహించేందుకు, వారి ప్రతిపాదనను మూల్యాంకనం చేసి అవసరమైన మార్గదర్శకత్వం అందించే కమిటీని ఏర్పాటు చేశారు.

అంతరిక్ష రంగంలో నాణ్యమైన మానవ వనరులను అభివృద్ధి చేయడానికి, ఇన్-స్పేస్ సీడ్ ఫండ్ పథకంతో పాటు ఇస్రోతో కలిసి స్వల్పకాలిక నైపుణ్య శిక్షణ కోర్సులను కాలానుగుణంగా నిర్వహిస్తోంది.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, ఇన్-స్పేస్ ద్వారా ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడానికి మరియు చేయూత నివ్వడానికి సీడ్ ఫండ్ స్కీమ్, ప్రైసింగ్ సపోర్ట్ పాలసీ, మెంటార్‌షిప్ సపోర్ట్, ఎన్ జీ ఈల కోసం డిజైన్ ల్యాబ్, స్పేస్ సెక్టార్‌లో నైపుణ్యాభివృద్ధి, ఇస్రో సౌకర్యాల వినియోగం మద్దతు, ఎన్ జీ ఈలకు సాంకేతికత బదిలీ వంటి వివిధ పథకాలు కూడా ప్రకటించబడ్డాయి మరియు అమలు చేయబడ్డాయి.

ప్రయోగ వాహనాలు మరియు ఉపగ్రహాల తయారీలో పరిశ్రమ భాగస్వామ్యాన్ని పెంచుతుందని భావిస్తున్న అంతరిక్ష వ్యవస్థలు మరియు అటువంటి ఎన్ జీ ఈల ద్వారా రూపొందించబడిన అనువర్తనాల అమలుకు అవసరమైన మద్దతును అందించడానికి ఇన్-స్పేస్ ఎన్ జీ ఈలతో దాదాపు 45 అవగాహన ఒప్పందాలపై సంతకం చేసింది.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, అంతరిక్ష రంగానికి సంబంధించి దేశంలో అనేక పరిశ్రమల సంఘాలు ఉన్నాయని, వాటిలో ఇండియన్ స్పేస్ అసోసియేషన్ (ఐ స్పా) ఒకటి. పరిశ్రమల సంఘాలు చేపడుతున్న కార్యకలాపాలు ప్రభుత్వ పరిధిలోకి రావని ఆయన చెప్పారు.

# డోనాల్డ్ ట్రంప్‌కు షాకిచ్చిన కొలరాడో అత్యున్నత న్యాయస్థానం

డెన్వర్ డిసెంబర్ 21 : అమెరికాలోని కొలరాడో రాష్ట్రానికి చెందిన అత్యున్నత న్యాయస్థానం.. మాజీ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు షాకిచ్చింది. వచ్చే ఏడాది జరగనున్న దేశాధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌ను అనర్హుడిగా ప్రకటించింది. స్టన్నింగ్ తీర్పును ఇచ్చిన కొలరాడో సుప్రీం కోర్టు.. దేశ రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం ఆ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పింది. ఈ తీర్పుతో కొలరాడో రాష్ట్రంలో ట్రంప్ తన రిపబ్లికన్ పార్టీ తరపున పోటీ చేయడానికి అనర్హుడయ్యారు. కొలరాడో కోర్టు అసాధారణ రీతిలో 4-3 తేడాతో తీర్పును వెలువరించింది. 2021, జనవరి ఆరో తేదీన జరిగిన క్యాపిటల్ హిల్ అటాక్ కేసులో కొలరాడో కోర్టు ఈ తీర్పును ఇచ్చింది. అయితే జనవరి 4వ తేదీ వరకు ఆ తీర్పుపై స్టే ఇచ్చారు. ఈ కేసులో అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు ట్రంప్ టీమ్ లీగల్ ప్రయత్నాలు మొదలు పెట్టింది. కొలరాడో కోర్టు ఇచ్చిన తీర్పు కేవలం ఆ రాష్ట్రానికి మాత్రమే పరిమితం అవుతుంది. మిగితా రాష్ట్రాలకు ఈ తీర్పు వర్తించదు. కానీ 2024లో జరగనున్న దేశాధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ పోటీ చేయనున్న విషయం తెలిసిందే. అయితే కొలరాడో తీర్పు ఆయన అభ్యర్థిత్వంపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాది మార్చి 3వ తేదీ జరగనున్న కొలరాడో ప్రైమరీ ఎన్నికలకు మాత్రమే తాజా తీర్పు వర్తిస్తుంది. ఆ ఎన్నికల్లో రిపబ్లికన్ ఓటర్లు అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకుంటారు. కొలరాడో తీర్పు వల్ల నవంబర్‌లో జరగనున్న దేశాధ్యక్ష ఎన్నికల్లో ప్రభావం ఉండే ఛాన్సు ఉంది. రాజ్యాంగంలోని 14వ సవరణ

# కరోనా కొత్త వెరియంట్ జెఎన్- 1 విస్తరించకుండా ముందస్తు జాగ్రత్తలు...

## -రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్ డిసెంబర్ 21(ఎక్స్ ప్రెస్‌న్యూస్);దేశంలో వేగంగా విస్తరిస్తున్న కరోనా కొత్త వెరియంట్ జెఎన్-1 మహమ్మారి కట్టడి పై తీసు కోవాల్సిన జాగ్రత్తలపై కేంద్ర ఆరో గ్యం, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ఆతీ. మంసుఖ్ మాండవీయ అధ్వర్యం లో అన్ని రాష్ట్రాల వైద్య, అరో గ్య శాఖ మంత్రులతో జరిగిన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర వైద్య, అరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజన ర్సింహ రాష్ట్ర సచివాలయం నుండి పాలొన్నారు. తెలంగాణ రాష్ట్రం లో కరోనా కొత్త వెరియంట్ జెఎన్-1 మహ మ్మారి కట్టడి పై తీసుకుంటున్న మందస్తు చర్యలను మంత్రి వీడియో కాన్ఫరెన్స్ లో వెల్లడించారు. ఈ వీడి యో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి , డైరెక్టర్ ఆఫ్ హెల్త్, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఈ నెల 24 న మాజీ సైనికులకు డబుల్ బెడ్ రూమ్‌లపై సమావేశం

## -ఈ సమావేశం లో మాజీ సైనికులు విదిగా పాల్గొనాలి

## -మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు అమ్మిక రంగయ్య గౌడ్ విజ్ఞప్తి

హైదరాబాద్ డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన ప్రజా దర్బార్ లో మాజీ సైనికుల సంక్షేమ సంఘం తరపున మాజీ సైనికుల సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం సమర్పించినట్లు మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు అమ్మిక రంగయ్య గౌడ్ తెలిపారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి గ్రీవెన్స్ సెల్ స్పందించింది. డబుల్ బెడ్ రూమ్ కావాలంటూ మన మనోవేదనను పరిగణనలోకి తీసుకుంటుంది-. మీ సమస్యను సంబంధిత శాఖ ద్వారా త్వరలో అందజేయడం జరుగుతుందని తెలియ జేసినట్లు ఆయన తెలిపారు. దీనికి సంబంధించి వచ్చే ఆదివారం (24/12/23) రోజునఉదయం 10-30 గంటలకు మండపం అల్వాల్‌లో ప్రభుత్వం ఇవ్వనున్న డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌ల గురించి చర్చించడానికి సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన తెపిపారు. ఇట్టి సమావేశానికి 2వ ప్రపంచ యుద్ధం మొదలు 1999 కార్గిల్ యుద్ధం వరకు చనిపోయిన సైనికుల కుటుంబాలు, వితంతువులు, మాజీ సైనికులు ,వారి కుటుంబ సభ్యులు విదిగా పాల్గొనవలసినదిగా కోరారు. ఈ సమావేశంలో మాజీ సైనికుల సమస్యల పై వారి వారి సలహాలు సూచలను చేయవలసిందిగా కోరుచున్నాము. మరింత సమాచారం కోసం దయచేసి 9346227672 ద్వారా సంప్రదించాలని రంగయ్య గౌడ్ కోరారు

# సీఎం రేవంత్ రెడ్డితో బీసీ సంఘాల భేటీ

## -అభినందనలు తెలిపిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

## -రాష్ట్రంలో కులగణన నిర్వహించాలని సీఎంను కోరిన జాజుల

హైదరాబాద్ డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డిని బుదవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల

### -సానుకూలంగా స్పందించిన సీఎం

స్థానిక సంస్థల ఎన్నికలైన గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని, బీసీ రిజర్వేషన్లు పెంచకుండా గ్రామపంచాయతీ ఇచ్చారు, సీఎంతో పాటు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు.?? సిఎం కలిసిన బీసీ ప్రతినిధుల బృందంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం



శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలోని వివిధ బీసీ సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు రాష్ట్ర అసెంబ్లీలో కలిసి అబినంధలు తెలిపారు, రేవంత్ రెడ్డిని ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ బీసీ సంఘాల ప్రతినిధుల బృందం శాలువాతో కప్పి, పూల బొక్కెలు అందించి సత్కరించారు,తదుపరి జాజుల శ్రీనివాస్ గౌడ్ బీసీ సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు, ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో బీసీ సమగ్ర కులగణను నిర్వహించాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా బీసీ రిజర్వేషన్లు 42 శాతం కు పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు, బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందని సీఎం దృష్టికి తీసుకుపోయారు, అలాగే బీసీ విద్యార్థుల పూర్తి ఫీజుల రియంబర్స్మెంటు అమలు చేయాలని ఆయన కోరారు. ??బీసీ కులగణను నిర్వహిస్తామని కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్ సదస్సులో తాము ప్రకటించామని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకారం కులగణను నిర్వహించి, బీసీ కులాల లెక్కలు తీస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు, కోర్టులో న్యాయపరమైనటువంటి అంశాలు ఉన్నందున ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి గ్రామపంచాయతీ ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని సిఎం హామీ గణేష్ చారి, కో చైర్మన్ చిన్న శ్రీశైలం యాదవ్,బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్,బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, సగర సంఘం అధ్యక్షుడు ఉప్పర శేఖర్ సాగర,బీసీ మహిళ సంఘం అధ్యక్షురాలు బి.మనిమంజరి,బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,బీసీ నేతలు రావులకోల్ నరేష్ ప్రజాపతి, గోదుగు మహేశ్ యాదవ్, నరసింహ నాయక్, సమతా యాదవ్, స్వర్ణ గౌడ్, తారకేశ్వరి,పానుగంటి విజయ్ ,సత్యం సగర తదితరులు పాల్గొన్నారు..

# ఏపీలో జగన్మోహన్ రెడ్డి సీఎం అయ్యాక రాక్షస పాలన, ఫ్యాక్షనిస్టు సాగుతోంది

## -టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్ రాజు

అమరావతి డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఏపీలో జగన్మోహన్ రెడ్డి సీఎం అయ్యాక రాక్షస పాలన, ఫ్యాక్షనిస్టు సాగుతోందని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్ రాజు అన్నారు.. నవగళం బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ.. హక్కుల కోసం పోరాడుతున్న వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. అరాచకపాలనపై విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు యువగళానికి బ్రహ్మరథం పట్టారన్నారు. యువగళాన్ని ఆపేందుకు వైసీపీ లైసెన్స్‌డ్ గూండాలు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని మండిపడ్డారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా యువనేత ముందుకు కదిలారే తప్ప... ఎక్కడా వెనకడుగు వేయలేదన్నారు. సైకో పాలనలో ప్రజాస్వామ్యయుతమైన పాలన కనుమరుగైందన్నారు. యువగళంతో నారా లోకేష్ జనహృదయనేతగా పేరు తెచ్చుకున్నారని ఎంఎస్ రాజు పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, టీడీపీ నేత నారా లోకేష్‌ల కలయికతో రాష్ట్రంలో చీకటి సామ్రాజ్యం అంతం కాబోతుందని ఎంఎస్ రాజు అన్నారు.

# విదేశీ, దేశీయ ఉపగ్రహాల సంఖ్య వరుసగా 33 & 31గా ఉందన్న కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 21:భారతదేశం 2003- 13 మధ్యన ప్రయోగించిన విదేశీ, దేశీయ ఉపగ్రహాల సంఖ్య వరుసగా 33 & 31గా ఉండగా, 2014-23 మధ్య ప్రయోగించిన విదేశీ, దేశీయ ఉపగ్రహాల సంఖ్య వరుసగా 396, 70గా ఉన్నాయని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ మంగళవారం వెల్లడించారు.

కేంద్ర శాస్త్రడసాంకేతిక (ఇండిపెండెంట్ ఛార్జి) సహాయమంత్రి, పిఎంఒ, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్లు, అణు ఇంధనం, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిస్తూ ఉపగ్రహాల ప్రయోగించడం ద్వారా 2014-23 మధ్య కాలంలో 157 మిలియన్ యుఎస్ డాలర్లు, 260 మిలియన్ యూరోల ఆదాయాన్ని ఆర్జించినట్టు వివరించారు. కాగా, 2003-13 మధ్య కాలంలో ఆదాయం 15 మిలియన్ల యుఎస్ డాలర్లు, 32 మిలియన్ల యూరోలుగా ఉందని ఆయన అన్నారు.

అంతరిక్ష విభాగానికి కేటాయించిన బడ్జెట్ ఆర్థిక సంవత్సరంలో ఉన్న రూ. 6792 కోట్ల నుంచి 2023-24కు రూ. 12,554 కోట్లకు పెరిగిందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

వివిధ అంతర్జాతీయ అంచనాలు, వార్తాపత్రికల ప్రకారం ఈ రంగం రానున్న కాలంలో 6-8% వృద్ధిని చవి చూడనుందని ఆయన అన్నారు.

# జగనన్న విదేశీ విద్యా దీవెన కార్యక్రమానికి నిధులు విడుదల

అమరావతి డిసెంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: జగనన్న విదేశీ విద్యా దీవెన కార్యక్రమానికి, సివిల్స్ పురస్కారం కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్ బుధవారం నిధులను విడుదల చేశారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... మంచి యూనివర్సిటీల్లో సీటు పొందితే ఫీజు ఎంతయినా ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఈ ఏడాది 51మందికి అడ్మిషన్ ఇస్తున్నారని.. రూ.41.59 కోట్లు ఫీజులు ఇప్పుడు చెల్లిస్తున్నామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ద్వారా పొందిన ఈ సహాయాన్ని మర్చిపోకుండా తిరిగి రాష్ట్రానికి కంట్రిబ్యూట్ చేయాలన్నారు.

408 మందికి నేడు ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు కావాలని యువత కలలు కంటుందని.. దీనికి కూడా మరో కార్యక్రమం ప్రారంభిస్తున్నా మన్నారు. ఎవ్వరైనా ప్రిలిమ్స్ పాస్ అయితే లక్ష రూపాయలు.. మెయిన్స్‌కు వెళితే లక్షన్నర ఇస్తున్నామన్నారు. 95 మందికి సివిల్స్ ప్రోత్సాహకం ప్రిలిమ్స్ కింద లక్షరూపాయలు, 11 మంది మెయిన్స్ క్లియర్ చేసిన వారికి లక్షన్నర అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఎల్లయ్య, పుల్లయ్య కాలేజీలకు విద్యార్థులను పంపించారన్నారు. అందుకే స్కీముల లో మార్పులు చేర్పులు చేశామని సీఎం జగన్ వెల్లడించారు.

# పేదలకు మంచి విద్య ఇస్తుంటే.. విపక్షాలు విషం కక్కుతున్నాయి- జగన్

అమరావతి, డిసెంబర్ 21:అల్లూరి జిల్లా: విద్యార్థులకు మంచి చేస్తుంటే విష ప్రచారం చేస్తున్నారని, విద్యార్థులకు చెడు చేస్తున్నామంటూ తప్పుడు రాతలు రాశారంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విపక్షాలపై మండిపడ్డారు. "గిట్టని వాళ్లు జగన్ దుబారా చేస్తున్నాడంటూ మాట్లాడుతున్నారు. దేశంలో ఏ ప్రభుత్వం కూడా పేదలకు ఈ స్థాయిలో ఖర్చుచేయలేదు. ఖర్చు చేసే ప్రతీ రూపాయి భావితరాల కోసమే" అని సీఎం పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఎనిమిదో తరగతి విద్యార్థులకు వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్స్ పంపిణీ చేపట్టింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి సీఎం జగన్.. గురువారం ఈ పంపిణీని ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ, "పిల్లలకు ఇచ్చే ఆస్తి చదువు మాత్రమే. విద్యార్థులకు మంచి చేస్తుంటే విష ప్రచారం చేస్తున్నారు. విద్యార్థులకు చెడు చేస్తున్నామంటూ తప్పుడు రాతలు రాశారు. పేద విద్యార్థులపై విషం కక్కొద్దని చెబుతున్నా. దిగజారుడు రాతలు రాయొద్దని చెబుతున్నా. పేద పిల్లల చేతిలో ట్యాబ్‌లు ఉంటే చెడిపోతారంట. పేద విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో చదవద్దా... పేద పిల్లలు ఇంగ్లీష్ మీడియం చదివితే తెలుగు అంతరించుకుపోతుందట. పేదలకు మంచి చేస్తుంటే మీకెందుకు ఈ కడుపుమంట. పేదల పిల్లలకు మంచి చేస్తుంటే విపక్షాలు ఏడుస్తున్నారు. ఇటువంటి దిక్కుమాలిన రాజకీయాలతో యుద్ధం చేస్తున్నాం" అంటూ సీఎం జగన్ ధ్వజమెత్తారు.

# రాయలసీమ యూనివర్సిటీలో సీఎం జన్మదిన వేడుకలు



అమరావతి, డిసెంబర్ 21:రాయలసీమ యూనివర్సిటీలో సీఎం జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు రాయలసీమ యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య కృష్ణా రెడ్డి, రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ చైర్మన్ శ్రీరాములు, అరెకటిక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కటిక గౌతమ్ హాజరయ్యారు. రాయలసీమ యూనివ ర్సిటీ విద్యార్థుల పెద్ద ఎత్తున హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. అనం తరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ చైర్మన్ శ్రీరాములు మాట్లాడుతూ కేజీ నుంచి పీజీ వరకు పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించిన గొప్ప వ్యక్తి సీఎం జగన్ అని కొనియాడారు. సంక్షేమ పథకాలు ద్వారా పేద ప్రజలను ఆదుకుంటున్న మంచి మనస్సు ఉన్న వ్యక్తి సీఎం జగన్ అన్నా రు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు 2మెడికల్ కాలేజీలు, సెంట్రల్ లా యూని వర్సిటీ ఇచ్చాడు అని అనేక విద్యా సంస్థలు ఇచ్చారన్నారు. నాడు టీడీపీ ప్రభుత్వం లో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు కేవలం 20000 మాత్రమే ఇచ్చే వారని కానీ విద్యార్థుల బాధ ను గుర్తించి ప్రతి రూపాయి కూడా విద్యార్థుల తల్లితండ్రులు మీద భారం కాకుండా మొత్తం పీజులు చెల్లించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.

# 65,300 వికసిత్ భారత్ ఆరోగ్య శిబిరాల్లో మొత్తం 1 కోటికి పైగా సందర్శనలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 21:ప్రస్తుతం కొనసాగుతున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా ఇప్పటి వరకు 3,156 గ్రామ పంచాయతీలు మరియు పట్టణ స్థానిక సంస్థలలో నిర్వహించిన 65,348 ఆరోగ్య శిబిరాలకు వచ్చిన సందర్శకుల సంఖ్య 1,03,55,555కి చేరుకుంది.

ఆయుష్మాన్ భారత్ - ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఎబి-పిఎంజెఎవై): వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా ఎంఒహెచ్ఎఫ్‌డబ్ల్యూ ఫ్లాగ్‌షిప్ పథకం కింద ఆయుష్మాన్ యాప్‌ని ఉపయోగించి ఆయుష్మాన్ కార్డులు జారీ చేయబడుతున్నాయి. లబ్ధిదారులకు ఆ భౌతిక కార్డులు పంపిణీ చేయబడుతున్నాయి. ఇప్పటి వరకు 19,03,200కి పైగా ఫిజికల్ కార్డులు పంపిణీ చేయబడ్డాయి.

నిన్న జరిగిన ఆరోగ్య శిబిరాల్లో మొత్తం 5,31,025 ఆయుష్మాన్ కార్డులు సృష్టించబడ్డాయి. మొత్తంగా ఇప్పటి వరకు 84,27,500 కార్డులు సృష్టించబడ్డాయి.

క్షయవ్యాధి (టిబి): లక్షణాల కోసం పరీక్షించడం, కఫం పరీక్ష మరియు అందుబాటులో ఉన్న చోట ఎన్ఎఎటి యంత్రాలను ఉపయోగించడం ద్వారా రోగులకు టిబి స్క్రీనింగ్ నిర్వహించబడుతుంది. టిబి ఉన్నట్లు అనుమానించబడిన కేసులను ఉన్నత సౌకర్యాలకు సూచిస్తారు. 34వ రోజు ముగిసే సమయానికి 36,48,700 కంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్షించబడ్డారు. వీరిలో 2,63,000 కంటే ఎక్కువ మంది ఉన్నత ప్రజారోగ్య సౌకర్యాలకు సూచించబడ్డారు.

ప్రధాన్ మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ (పిఎంటిబిఎంఎ) కింద టిబితో బాధపడుతున్న రోగులనుండి నిక్షయ్ మిత్రల నుండి సహాయం పొందడం కోసం సమ్మతి తీసుకోబడింది. నిక్షయ్ మిత్రలుగా ఉండటానికి సిద్ధంగా ఉన్న హాజరైన వారికి ఆన్-స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా అందించబడుతుంది. పిఎంటిబిఎంఎ కింద ఇప్పటివరకూ 1,19,500 కంటే ఎక్కువ మంది రోగులు సమ్మతి ఇచ్చారు మరియు 46,700 కంటే ఎక్కువ మంది కొత్త నిక్షయ్ మిత్రలు నమోదు చేయబడ్డారు.

నిక్షయ్ పోషణ్ యోజన (ఎన్‌పివై) కింద, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా టిబి రోగులకు నగదు సహాయం అందించబడుతుంది. ఇందుకోసం పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల బ్యాంకు ఖాతా వివరాలను సేకరించి ఖాతాలకు ఆధార్ సీడింగ్ చేస్తున్నారు. ఇలా 31,300 మంది లబ్ధిదారుల వివరాలను సేకరించారు.

సికిల్ సెల్ డిసీజ్: గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎస్‌సిడి కోసం పాయింట్ ఆఫ్ కేర్ (పిఒసి) పరీక్షల ద్వారా లేదా సాల్యుబిలిటీ ద్వారా సికిల్ సెల్ డిసీజ్ (ఎస్‌సిడి)ని గుర్తించడం కోసం అర్హులైన జనాభా (40 సంవత్సరాల వరకు) స్క్రీనింగ్ జరుగుతోంది. పరీక్ష పాజిటివ్‌గా వచ్చిన కేసులను నిర్వహణ కోసం ఉన్నత కేంద్రాలకు పంపుతున్నారు. ఇప్పటివరకు 3,83,000 మందికి పైగా స్క్రీనింగ్ చేయబడ్డారు, వారిలో 18,300 మంది పాజిటివ్‌గా ఉన్నట్లు కనుగొనబడింది మరియు ఉన్నత ప్రజారోగ్య సౌకర్యాలకు సూచించబడింది.

నాన్-కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సిడిలు): హైపర్‌టెన్షన్ మరియు డయాబెటిస్ పరీక్షలు అవసరమైన వారికి (30 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ) స్క్రీనింగ్ చేయబడుతోంది మరియు పాజిటివ్‌గా అనుమానించబడిన కేసులను ఉన్నత కేంద్రాలకు సిఫార్సు చేస్తున్నారు. దాదాపు 81,15,000 మందిని హైపర్‌టెన్షన్ మరియు డయాబెటిస్ కోసం పరీక్షించారు. వారిలో 3,74,000 మందికి పైగా హైపర్‌టెన్షన్ ఉన్నట్లు అనుమానించబడింది మరియు 2,69,800 మందికి పైగా మధుమేహం ఉన్నట్లు అనుమానించబడింది మరియు 5,99,200 మందికి పైగా ప్రజలు ఉన్నత ప్రజారోగ్య సౌకర్యాలకు రెఫర్ చేయబడ్డారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాల పట్ల దేశవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను గౌరవనీయ ప్రధానమంత్రి నవంబర్ 15న జార్ఖండ్‌లోని ఖుంటి నుండి ప్రారంభించారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కింద ఆన్-స్పాట్ సేవల్లో భాగంగా గ్రామ పంచాయతీలలో ఐఈసీ వ్యాన్‌ను నిలిపి ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నారు.

## తమిళనాడులోని వరద ప్రభావిత ప్రాంతాల్లో భారతీయ తీర రక్షణ దళం సహాయక కార్యక్రమాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 21:తమిళనాడులోని వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించడం, స్థానికులకు సహాయ సామగ్రి సరఫరా కోసం కేంద్ర ప్రభుత్వాన్ని తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం సాయం కోరడంతో, తమిళనాడులో సహాయక కార్యక్రమాల కోసం భారతీయ తీర రక్షణ దళం ఆరు విపత్తు సహాయక బృందాలను (డీఆర్‌టీ) మోహరించింది.

ట్యుటికోరిన్ తీర ప్రాంతాల్లో పరిస్థితిని పర్యవేక్షించడానికి, సముద్రంలో, తీర ప్రాంతాల్లో ఏదైనా అనుకోని సంఘటనలు జరిగితే వెంటనే ప్రతిస్పందించడానికి హెలికాప్టర్‌తో కూడిన తీర ప్రాంత నిఘా నౌకను కూడా ఐసీజీ మోహరించింది.

శ్రీలంక & తమిళనాడు దక్షిణ జిల్లాల్లో తుపాను ఫలితంగా ఈ నెల 17, 18 తేదీల్లో అతి భారీ వర్షాలు కురిశాయి. దీనివల్ల తిరునెల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో వరదలు పోటెత్తాయి. ప్రస్తుతం, ట్యుటికోరిన్‌లో మొబైల్ ఫోన్ సంకేతాలు అందుబాటులో లేవు.

ట్యుటికోరిన్‌లోని భారతీయ తీర రక్షణ దళం జిల్లా ప్రధాన కార్యాలయం తిరునెల్వేలి, తూత్తుకుడి జిల్లా యంత్రాంగాలతో సమన్వయం చేసుకుంటోంది. ట్యుటికోరిన్ విమానాశ్రయాన్ని మూసివేయడంతో, వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక కార్యక్రమాల కోసం, అవసరమైతే చెన్నై నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని తీసుకురావడానికి మదురైలో డోర్నియర్ విమానం, ఏఎల్‌హెచ్ హెలికాప్టర్‌ను సిద్ధంగా ఉంచింది. ఈలోగా, చిన్నపాటి పడవలతో కూడిన ఈతగాళ్ల బృందాన్ని, ఒక విపత్తు సహాయక బృందాన్ని ట్యుటికోరిన్‌కు పంపింది.

# బిసాగ్-ఎన్ కార్యాలయం కొత్త ఢిల్లీలో ప్రారంభం



న్యూఢిల్లీ, డిసెంబర్ 21:పీఎం గతిశక్తి భాస్కరాచార్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్పేస్ అప్లికేషన్స్ అండ్ జియో-ఇన్ఫర్మేటిక్స్ (బిసాగ్-ఎన్) ఆఫీస్-కమ్-ట్రైనింగ్ సెంటర్‌ను పరిశ్రమ, అంతర్గత వాణిజ్య ప్రమోషన్ విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ ప్రారంభించారు. డీపీఐఐటీ ప్రత్యేక కార్యదర్శి, లాజిస్టిక్స్ విభాగం శ్రీమతి సుమితా దావ్రా, బిసాగ్-ఎన్ డైరెక్టర్ జనరల్ శ్రీ టి.పి. సింగ్ నిన్న న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రారంభోత్సవం ఒక ముఖ్యమైన మైలురాయి. ఇది సంబంధిత వరుస మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర/యుటీలతో బిసాగ్-ఎన్ సాధారణ, మెరుగైన పరస్పర చర్య కోసం కొత్త అవకాశాలను సృష్టిస్తుంది. పీఎం గతిశక్తి కోసం లాజిస్టిక్స్ విభాగానికి సాంకేతిక భాగస్వామిగా, బిసాగ్-ఎన్, జీఐఎస్-ఆధారిత పీఎం గతిశక్తి ఎన్ఎంపీ ప్లాట్‌ఫారమ్ రూపకల్పన, అభివృద్ధి, కార్యాచరణ, నిర్వహణ, అప్‌గ్రేడేషన్‌లో నిమగ్నమై ఉంది.

# ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించింది: శ్రీ భూపేందర్ యాదవ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 21:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించిందని కేంద్ర పర్యావరణ, అటవీ,వాతావరణ మార్పు ఉపాధి, కార్మిక శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ అన్నారు. వాతావరణ చర్యలు, ఆవిష్కరణలు, సాంకేతిక రంగాల్లో భారతదేశ సామర్థ్యాన్ని ప్రపంచ దేశాలు గుర్తించాయని ఆయన పేర్కొన్నారు. ఈరోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీ యాదవ్ మాట్లాడుతూ వివిధ రంగాలలో భారతదేశం సాధించిన ప్రగతిని వివరించారు. "భారతదేశం కేవలం రూ. 615 కోట్లు వెచ్చించి విజయవంతంగా చంద్రుడిని చేరుకుంది. చంద్రుని దక్షిణ ధ్రువాన్ని చేరుకున్న మొదటి దేశం భారతదేశం. చంద్రయాన్ 3తో అంతరిక్ష రంగంలో భారతదేశం స్వావలంబన సాధించింది. గతంలో విదేశాల సహకారంతో భారతదేశం అంతరిక్ష యాత్రలు సాగించింది. అంతరిక్ష రంగంలో స్వయం సమృద్ధి సాధించి చంద్రయాన్-3 ని భారతదేశం స్వయంగా నిర్వహించి విజయం సాధించింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అనుసరించిన విధానాలతో ఇది సాధ్యమయ్యింది " అని శ్రీ యాదవ్ వివరించారు.

కోవిడ్ మహమ్మారిని ఎదుర్కోవడానికి భారతదేశం అనుసరించిన విధానంతో ప్రపంచ దేశాలు ఆశ్చర్యానికి గురయ్యాయని శ్రీ యాదవ్ అన్నారు. "కోవిడ్ మహమ్మారి తీవ్రంగా ఉన్న సమయంలో భారతదేశం పతనమవుతుందని ప్రపంచం భావించింది. అయితే, అంచనాలు తలకిందులు చేస్తూ కోవిడ్ ని ఎదుర్కొని భారతదేశం నిలబడింది. కోవిడ్‌పై దాని ప్రతిస్పందన ప్రపంచానికి ఒక ఉదాహరణగా మారింది. భారతదేశం అతిపెద్ద టీకా కార్యక్రమాన్ని అత్యంత వేగంగా నిర్వహించి ప్రజల ప్రాణాలు రక్షించింది. వ్యాక్సిన్‌లు భారతదేశంలో ఉత్పత్తి అయ్యాయి. టీకాలు అవసరమైన దేశాలకు భారతదేశం సహాయం చేసింది. మైత్రి కార్యక్రమం కింద భారతదేశం దాదాపు 100 దేశాలకు వ్యాక్సిన్ సరఫరా చేసి సహకారం అందించింది.'' అని మంత్రి తెలిపారు.

కోవిడ్ నివారణ కోసం భారతదేశం అనుసరించిన విధానాన్ని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు, ప్రశంస లభించిందని తెలిపిన శ్రీ యాదవ్ "భారతదేశం సన్నద్ధమైతే ప్రపంచం సన్నద్ధమైనట్టే " అంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యాఖ్యలను గుర్తు చేశారు.

భారతదేశ ఆర్థిక పరిస్థితిపై మాట్లాడిన శ్రీ యాదవ్ "కోవిడ్ తర్వాత భారత ఆర్థిక వ్యవస్థ పతనం అవుతుంది అని ప్రతి ఒక్కరూ భావించారు. అయితే, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకొని విజయం సాధించింది. కోవిడ్ -19ని ఎదుర్కోవడంలో భారతదేశం అమలు చేసిన చర్యలు ప్రపంచ గుర్తింపు పొందాయి. భారతదేశం సాధించిన ల ఆకార ఆర్థిక పునరుద్ధరణ పట్ల అంతర్జాతీయ ద్రవ్య నిధి,, ప్రపంచ బ్యాంక్, ఇతర అంతర్జాతీయ సంస్థలు సంతృప్తి వ్యక్తం చేశాయి. చైనా, అమెరికాలు మించి భారతదేశం అభివృద్ధి సాధించింది" అని శ్రీ యాదవ్ అన్నారు. " భారతదేశ ఆర్థిక వ్యవస్థ కోలుకోలేదని, ఒకవేళ కోలుకున్నా జ ఆకారంలో అభివృద్ధి ఉంటుందని భావించారు. అయితే, భారతదేశం ఎ ఆకార వృద్ధి సాధించి ప్రతి ఒక్కరినీ ఆశ్చర్య పరిచింది" అని మంత్రి అన్నారు.

ప్రపంచ మాంద్యం మధ్య భారతదేశాన్ని ప్రకాశవంతమైన ప్రదేశంగా అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకుతో సహా అనేక అంతర్జాతీయ సంస్థలు గుర్తించాయని ఆయన అన్నారు. "స్థూల దేశీయోత్పత్తిలో భారతదేశం బ్రిటన్‌ను అధిగమించి ప్రపంచంలోని ఐదవ-అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే అవకాశం ఉంది. 23/24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ జీడీపీ 6.3% వృద్ధి సాధిస్తుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. అమెరికా (2.1%), చైనా (4.4%),, యూరోజోన్ (0.7%) వంటి ప్రధాన ఆర్థిక వ్యవస్థలకు మించి భారతదేశ వృద్ధి(ఐఎంఎఫ్ , అక్టోబర్ 2023) కొనసాగుతోంది, "అని శ్రీ యాదవ్ చెప్పారు.

గ్లోబల్ దిగ్గజాలు భారతదేశంలో తమ ఉత్పత్తి కేంద్రాలు ప్రారంభిస్తున్నాయని శ్రీ యాదవ్ తెలిపారు. "యాపిల్ తన తాజా ఐఫోన్ 15 ను భారతదేశంలో అసెంబ్లింగ్ చేయడం ప్రారంభించింది. భారతదేశంలో సెమీకండక్టర్లను సంయుక్తంగా తయారు చేసేందుకు తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ వేదాంతతో ఒప్పందం కుదుర్చుకుంది , ''అని మంత్రి వివరించారు.

జీడీపీ పరంగా 2025లో జర్మనీని, 2027లో జపాన్‌ను అధిగమించి అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని శ్రీ యాదవ్ అన్నారు.

2047 నాటికి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అమృత్‌కాల్ సాకారాన్ని జరుపుకుంటున్న సందర్భంగా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతామని ప్రధాని మోదీ ప్రతినబూనారు" అని కేంద్ర మంత్రి తెలిపారు.

ప్రపంచాన్ని ఒక కుటుంబంగా భావించి ఆధ్యాత్మిక,నాగరికత మూలాలు (వసుధైక కుటుంబం), అందరికీ సంతోషం (సర్వే భవన్తు సుఖినః) విధానం అనుసరించి అంతర్జాతీయ రంగంలో భారతదేశం కీలక పాత్ర పోషించాలి అని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ భావన. ఈ విధానాలు అనుసరించి ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విధానాలు దేశ ప్రజల మన్నన, విశ్వాసం పొందాయి. తమ భవిష్యత్తు సురక్షితంగా ఉందని ప్రజలు భావిస్తున్నారు. సురక్షితమైన భారతదేశం మాత్రమే సమస్యలు శక్తివంతంగా ఎదుర్కోగలదు అని ప్రధానమంత్రి విశ్వసిస్తున్నారు" అని శ్రీ యాదవ్ అన్నారు.

శక్తి సామర్థ్యాలు, గొప్ప సాంస్కృతిక వారసత్వం కలిగిన భారతదేశం ప్రపంచ ఆధిపత్యం లో కీలక పాత్ర పోషిస్తుందని శ్రీ యాదవ్ అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కృషితో భారతదేశ ప్రాచీన సంప్రదాయాలు, యోగా, ఆయుర్వేదం వంటి వాటికి ప్రపంచవ్యాప్త ప్రజాదరణ లభించిందని తెలిపిన శ్రీ యాదవ్ "నాటు నాటు ఆస్కార్ సాధించింది. ఎలిఫెంట్ విస్పరర్స్ భారతదేశం సాధించిన మరో గొప్ప విజయం. ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న భారతీయులు సాంస్కృతికవిలువలు, సంప్రదాయాలు మరియు ఆలోచనల పరిరక్షణకు కృషి చేస్తున్నారు" అని మంత్రి అన్నారు.

భారత ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి శ్రీ నరేంద్ర మోదీ ప్రపంచ స్థాయిలో భారతదేశానికి గుర్తింపు సాధించి ప్రపంచ దేశాలపై ప్రభావం చూపుతున్నారని శ్రీ యాదవ్ అన్నారు. ప్రపంచ నేతలు మోడీపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

"గత 10 సంవత్సరాల కాలంలో భారతదేశం అన్ని స్థాయిలలో దేశంలో సానుకూల అభివృద్ధి సాధించింది.. నేడు యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా కాకుండా ఉద్యోగాలు ఇచ్చేవారుగా మారుతున్నారు. ప్రతిరోజూ కొత్త స్టార్టప్‌లను ప్రారంభించడంలో భారతదేశం ప్రపంచంలో అగ్ర స్థానంలో ఉంది. స్టార్టప్‌ల సంఖ్యలో భారతదేశం 2వ స్థానంలో ఉంది . అతిపెద్ద ప్రారంభ పర్యావరణ వ్యవస్థలో 3వ స్థానం పొందిన భారతదేశం ప్రపంచంలో యునికార్న్‌లను కలిగి ఉన్న దేశాల జాబితాలో 3వ స్థానంలో ఉంది. 2021లో రోజుకు ప్రతి 29 రోజులకు ఒక యునికార్న్‌ఏర్పాటు అయ్యేది. 2022 నాటికి ప్రతి 9 రోజులకు ఒక యునికార్న్‌ఏర్పాటు అవుతోంది' అని శ్రీ యాదవ్ అన్నారు.

ప్రపంచ అవసరాలు దృష్టిలో ఉంచుకుని భారతదేశం పర్యావరణ పరిరక్షణ చర్యలు అమలు చేస్తోందని శ్రీ యాదవ్ తెలిపారు.

"ప్రపంచ వాతావరణ మార్పు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న భారతదేశం పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇనిషియల్ అడాప్టేషన్ కమ్యూనికేషన్‌తో పాటు 2019 గ్రీన్‌హౌస్ గ్యాస్ ఇన్వెంటరీపై యుఎన్ఎఫ్ సిసిసి ఒప్పందంపై 26 దేశాలతో పాటు భారతదేశం సంతకం చేసింది. అంతర్జాతీయ సౌర కూటమి, లీడ్-ఐటీ, సిడీఆర్ఐ, ఐఆర్ఐఎస్, గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్, ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ వంటి వాతావరణ చర్యల కోసం భారతదేశం కార్యక్రమాలు ప్రారంభించింది. 2030 కి నిర్దేశించిన పునరుత్పాదక ఇంధన లక్ష్యాన్ని 2020-21 లో భారతదేశం సాధించింది" అని శ్రీ యాదవ్ వివరించారు. .ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాల వల్ల సుస్థిరమైన అభివృద్ధి, వాతావరణ పరిరక్షణ అంశాల్లో ప్రపంచ దేశాలకు భారతదేశం సహకారం అందిస్తోందని కేంద్ర మంత్రి అన్నారు.

ప్రపంచవ్యాప్తంగా శాంతి పరిరక్షణ ప్రయత్నాలలో భారతదేశం చేస్తున్న కృషిని కూడా శ్రీ యాదవ్ వివరించారు.

"భూకంపాలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రభావితమైన దేశాలకు భారతదేశం విపత్తు సహాయాన్ని అందించింది. జెనరిక్ ఔషధాలు,సరసమైన ఆరోగ్య సంరక్షణ చర్యలు అమలు చేయడంలో భారతదేశం ముందుంది. టెలిమెడిసిన్, కృత్రిమ మేధస్సు వంటి ఆరోగ్య సంరక్షణ కోసం దేశం కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేస్తోంది. మానవతా దృక్పథంతో అవసరమైన దేశాలకు భారతదేశం అండగా నిలుస్తోంది.'' అని శ్రీ యాదవ్ అన్నారు.

# 'పీఎం గతిశక్తి సమగ్ర నివేదిక ॥ 'ని విడుదల చేసిన శ్రీ పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, డిసెంబర్ 21:పీఎం గతిశక్తి పై రూపొందించిన మూడు పత్రాలను కేంద్ర వాణిజ్యం ,పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ, జౌళి శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ మూడు పత్రాలను విడుదల చేశారు, "పీఎం గతిశక్తి సమగ్ర నివేదిక ఎఎ" "ప్రధాన మంత్రి గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ అమలు, బాధ్యతలు ", "జిల్లా కలెక్టర్ల కోసం పీఎం గతిశక్తికరదీపిక" "ప్రాంతీయ అభివృద్ధి కోసం జాతీయ మాస్టర్ ప్లాన్"ను న్యూఢిల్లీలోని వాణిజ్య భవన్‌లోనిన్న జరిగిన కార్యక్రమంలో మంత్రి విడుదల చేశారు. కార్యక్రమంలో కేంద్ర వాణిజ్యం,పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ సోమ్ ప్రకాష్, పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య విభాగం కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ సింగ్, ప్రత్యేక కార్యదర్శి (లాజిస్టిక్స్) శ్రీమతి. సుమితా దావ్రా, ఃమొంఉ-ఔ డైరెక్టర్ జనరల్ శ్రీ ం.ఖ సింగ్, నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ సభ్యులు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీ గోయల్ గత రెండేళ్లలో పీఎం గతిశక్తి అమలు ద్వారా సాధించిన ఫలితాలు,ప్రగతి పట్ల అధికారులను అభినందించారు. సమీకృత డేటా ఆధారిత వ్యవస్థ ద్వారా ముఖ్యమైన సమస్యలను పరిష్కరించడంలో, ప్రాజెక్ట్ రూపకల్పన, వ్యయ ప్రభావానికి హామీ ఇవ్వడం, సమయానుకూలంగా అమలు చేయడం, త్వరితగతిన నిరభ్యంతర అనుమతులు జారీ చేయడం, భూసేకరణ వంటి అంశాలలో పీఎం గతిశక్తి వల్ల ప్రయోజనాలు కలుగుతాయని ఆయన అన్నారు.

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ సోమ్ ప్రకాష్ మాట్లాడుతూ పీఎం గతిశక్తి ని ఉపయోగించి ప్రాంతాల అభివృద్ధి కోసం రూపొందించిన సమగ్ర ప్రణాళిక కింద మౌలిక సదుపాయాలు, ఆర్థిక, సామాజిక మంత్రిత్వ శాఖలు/విభాగాలు కార్యక్రమాలు/ పథకాలు చేపట్టాలని సూచించారు. . ఈ మూడు పత్రాలు విడుదల చేయడం వల్ల మన దేశ మౌలిక సదుపాయాల ప్రణాళిక మరింత సమర్థంగా అమలు జరిగి భారతదేశ రవాణా సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది అని మంత్రి అన్నారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం జిల్లా/స్థానిక స్థాయిలో కార్యక్రమాలు అమలు చేసిన సాధించిన అభివృద్ధిని పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య విభాగం కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ సింగ్ వివరించారు. ఈ పత్రాలు అన్ని వాటాదారులకు ప్రయోజనం కలిగిస్తాయని, సమీకృత ప్రణాళిక, తాత్కాలిక సమస్యల పరిష్కారం, కేంద్ర, రాష్ట్ర మరియు స్థానిక స్థాయిలో సంబంధిత వర్గాల మధ్య సమన్వయాన్ని సాధించటానికి వీలు కల్పిస్తామని అన్నారు.

డేటా యాజమాన్యం మరియు నాణ్యత నిర్వహణ,నివేదికల వినియోగానికి సంబంధించి సమిష్టి ప్రయత్నాలు అమలు జరుగుతున్నాయని శ్రీమతి. సుమితా దావ్రా తెలిపారు. (తి) ''భారతదేశంలో రవాణా ఖర్చు:మదింపు దీర్ఘకాలిక వ్యవస్థ "(తితి) "వివిధ రాష్ట్రాల్లో సులభతరం రవాణా - 2023" విడుదల చేసిన పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య విభాగం (తితితి) న్యూఢిల్లీలో ఃమొంఉ-ఔ ఆఫీస్-కమ్-ట్రైనింగ్ సెంటర్ ను ప్రారంభించింది. శ్రీ గోయల్ . విడుదల చేసిన మూడు పత్రాలు పీఎం గతిశక్తి అమలులో వాటాదారుల పాత్రలు, బాధ్యతలను నిర్దేశిస్తాయి. జిల్లా/స్థానిక స్థాయిలో ప్రాంత అభివృద్ధి ప్రణాళికను సులువుగా అమలు చేసేందుకు అవకాశం కల్పించి, సంబంధిత వర్గాలు సమన్వయంతో పని చేయడానికి అవకాశం కల్పిస్తామని ఆమె వివరించారు.

పీఎం గతిశక్తిని ప్రారంభించి రెండు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య విభాగం , అక్టోబర్ 13, 2023న''పీఎం గతిశక్తి సంగ్రహం: వాల్యూమ్ ఎ" విడుదల చేసింది. దీనికి కొనసాగింపుగా పీఎం గతిశక్తి కింద సాధించిన ప్రగతి వివరిస్తూ "పీఎం గతిశక్తి సంగ్రహం: వాల్యూమ్ ఎఎ''నరూపొందించి విడుదల చేసింది.

పీఎం గతిశక్తి ఆధారంగా బరేలీ, గోరఖ్‌పూర్, సిలిగురిని కలుపుతూ నిర్మించిన హై-స్పీడ్ హైవే నిర్మాణం సహా అనేక రకాల ప్రాజెక్టుల వివరాలను నివేదికలో పొందుపరిచారు. బెంగళూరు లో పట్టణ రద్దీని పరిష్కరించడం, అరుణాచల్ ప్రదేశ్‌లో రవాణా సౌకర్యాలు అభివృద్ధి చేసి రవాణా సౌకర్యాలు మెరుగుపరిచి పర్యాటక రంగం అభివృద్ధికి అమలు చేసిన కార్యక్రమాలను నివేదికలో పేర్కొన్నారు.

పీఎం గతిశక్తిని అమలు చేయడం వల్ల వేగవంతమైన నిర్ణయం తీసుకోవడం,సమగ్ర ప్రణాళిక రూపకల్పన, సమయం వ్యయాన్ని తగ్గించడం, డిజిటల్ సాధనాల వినియోగం లాంటి ప్రయోజనాలను నివేదికలో వివరించారు. సులభతరం వ్యాపార నిర్వహణ, జీవం సౌలభ్యం కల్పించడానికి అమలు చేయాల్సిన చర్యలను నివేదికలో పొందుపరిచారు.

"జిల్లా కలెక్టర్ల కోసం కరదీపిక : " ప్రాంతీయ అభివృద్ధి కోసం పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్"

సమగ్ర ప్రాంత-ఆధారిత సామాజిక-ఆర్థిక అభివృద్ధికి పీఎం గతిశక్తి ప్రాధాన్యత ఇస్తుంది. దీనిని సాధించడానికి జిల్లా/స్థానిక స్థాయి ప్రణాళిక అమలు చేయాల్సి ఉంటుంది. జిల్లా స్థాయి అధికారుల పాత్ర తెలియజేసే విధంగా "జిల్లా కలెక్టర్ల కోసం కరదీపిక : " ప్రాంతీయ అభివృద్ధి కోసం పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్" రూపొందించారు. ఈ కరపత్రం ప్రాంతీయ అభివృద్ధి ప్రణాళిక సూత్రాల వివరణాత్మక అవలోకనాన్ని అందిస్తుంది. లక్ష్యాల సాధనలో జిల్లా/స్థానిక స్థాయి పరిపాలన వ్యవస్థ పాత్రను తెలియజేస్తుంది. అవాంతరాలు లేకుండా పీఎం గతిశక్తిని జిల్లా స్థాయిలో అమలు చేయడం, సామాజిక ఆర్థిక మౌలిక సదుపాయాల ప్రణాళిక, అమలులో పాల్గొనే జిల్లా/స్థానిక స్థాయిలో వాటాదారుల పాత్రలు, బాధ్యతలపై పూర్తి అవగాహన ను అందిస్తుంది

"పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్‌పై పాత్రలు, బాధ్యతల సంగ్రహం"వివిధ మంత్రిత్వ శాఖలు/రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కోసం రూపొందించిన "పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్‌పై పాత్రలు, బాధ్యతల సంగ్రహం" కూడా విడుదల అయ్యింది. వివిధ మంత్రిత్వ శాఖలు / విభాగాలు, రాష్ట్రాలుకేంద్రపాలిత ప్రాంతాలు ఃమొంఉ-ఔ, లాజిస్టిక్స్ డివిజన్‌తో సహా వాటాదారుల పాత్రలు, బాధ్యతలను దీనిలో వివరించారు.

నాణ్యత, నవీకరణ యంత్రాంగం, డేటా సవరణ, డేటా నిర్వహణ ప్రమాణాలను తనిఖీ చేయడానికి చెక్‌లిస్ట్ సిద్ధం చేసి స్పష్టత, సహకారం, సమర్థంగా పని చేయడానికి ప్రతి మంత్రిత్వ శాఖ/విభాగం /రాష్ట్రం కేంద్రపాలిత ప్రాంతానికి ఉపయోగపడుతుంది.

## యువగళం ముగింపు సభకు అడుగడుగునా అవరోధాలు

విజయనగరం డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్‌బి): యువగళం ముగింపు సభకు అడుగడుగునా అవరోధాలు ఎదురవుతూనే ఉన్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయనగరం రైల్వేస్టేషన్‌కు వచ్చే రైళ్లలో అనూహ్య జాప్యం నెలకొంది. ఒంగోలు నుంచి వస్తున్న స్పెషల్ రైలు 6 గంటలు ఆలస్యంగా నడిచింది. అధికారులు పలు స్టేషన్లలో లూప్ లైన్‌లో పడేయడంతోనే జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. మరోవైపు విజయనగరంలో దిగిన తరువాత బస్‌లు, ఇతర వాహనాలను అనుమతి లేకపోవడంతో తెలుగు తమ్ముళ్లు నిరసనకు దిగారు. ఆటోల్లో టీడీపీ కార్యకర్తలను తరలిస్తుంటే ఓవర్లోడ్ అని పోలీసులు ఆపుతున్నారని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది నడుచుకుంటూ కళ్యాణ మండపాలకు చేరుకంటున్న పరిస్థితి. కార్యకర్తలకు ప్రతి బందకాలపై టీడీపీ నేతల సీరియస్ అవుతున్నారు.

## రాజధాని కార్యాలయాల తరలింపుపై హైకోర్ట్ సీరియస్

అమరావతి డిసెంబర్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: క్యాంప్ కార్యాలయం ముసుగులో రాజధాని కార్యాలయాల తరలింపుపై హైకోర్ట్ సీరియస్ వ్యాఖ్యలు చేసింది. తరలింపును సవాల్ చేస్తూ రైతులు వేసిన పిటీషన్‌పై బుధవారం హైకోర్ట్‌లో విచారణ జరిగింది. ఈ పిటీషన్‌ను ముగ్గురు సభ్యుల ధర్మాసనంకు పంపుతామని హైకోర్ట్ చెప్పింది. అక్కడ ఇప్పటికే విచారణ పెండింగ్‌లో ఉన్నాయని.. ఈ లోపు పిటిషన్ వేసిన రైతుల ఆందోళనను పరిగణలోకి తీసుకోవాల్సి ఉందని హైకోర్ట్ న్యాయమూర్తి తెలిపారు. రాజధాని కార్యాలయాల తరలింపుపై స్టేటస్ కో విధిస్తామని ధర్మాసనం చెప్పింది. దీంతో తాము ప్రభుత్వం నుంచి ఆదేశాలు తీసుకుంటామని ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. తదుపరి విచారణను హైకోర్టు రేపటి(గురువారం)కి వాయిదా వేసింది

## లోకేష్ యువగళం అట్టర్ ఫ్లాప్.. అంబటి రాంబాబు

అమరావతి, డిసెంబర్ 21:టీడీపీ నేత, మాజీ మంత్రి లోకేష్ నిర్వహించిన యువగళం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని ఏపీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లిలో ఆయన మాట్లాడుతూ? యువగళం ముగింపు సభ అంతకంటే అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు.

గతంలో చంద్రబాబు, లోకేష్ ను పవన్ చాలాసార్లు తిట్టారన్నారు. పవన్ కళ్యాణ్ తన క్యాడర్ ను మోసం చేస్తున్నారన్నారు. పవన్ ఎప్పుడూ చంద్రబాబుతోనే ఉన్నారన్నారు. చంద్రబాబు అడ్డగోలుగా పరిపాలించినప్పుడు పవన్ ఎందుకు ప్రశ్నించలేదని అన్నారు. టీడీపీని బలోపేతం చేసేందుకే పవన్ పార్టీ పెట్టారా అని ప్రశ్నించారు.

# విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన జగన్...



అమరావతి, డిసెంబర్ 21: ఆంధ్రప్రదేశ్ లోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్ ల పంపిణీని సీఎం జగన్ ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో జగన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వరుసగా రెండో ఏడాది కూడా విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్ లను అందజేస్తోంది. అంతర్జాతీయ వేదికలపై ఏపీ విద్యార్థులు ప్రతిభ కనబర్చాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు సీఎం జగన్ చెప్పారు. ఈ ఏడాది రూ.620 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని 9,424 పాఠశాలల్లోని విద్యార్థులకు 4,34,185 ట్యాబ్ లను అందించనున్నట్లు తెలిపారు. ఈ ట్యాబ్ లలో రూ.15,500 విలువైన బైజూస్ కంటెంట్ ను ప్రిలోడెడ్ గా ఇస్తున్నామని, ట్యాబ్ ధర రూ.17,500 తో కలిపి ప్రతీ విద్యార్థికి రూ.33 వేల మేర లబ్ది కలుగుతుందని చెప్పారు.

తాజాగా అందజేస్తున్న ట్యాబ్ లతో కలిపి రెండేళ్లలో 9,52,925 ట్యాబ్ లు (విద్యార్థులు, టీచర్లకు కలిపి) పంపిణీ చేశామని ప్రభుత్వం వెల్లడించింది. వీటి విలువ రూ.1,305.74 కోట్లు అని అధికారులు చెప్పారు. విద్యార్థులకు అందించిన ట్యాబ్ లలో ఇంటర్మీడియెట్ కంటెంట్ ను కూడా అప్ లోడ్ చేసేలా మార్పులు చేశామన్నారు. ఇందుకోసం ట్యాబ్ స్టోరేజ్ సామర్థ్యాన్ని 256 జీబీకి పెంచినట్లు తెలిపారు. ఈ ట్యాబ్ లను దుర్వినియోగం చేయకుండా ఈసారి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అవాంఛనీయ సైట్లు, యాప్స్ ను నిరోధించే ప్రత్యేక సాఫ్ట్ వేర్ ను ఇన్ బిల్ట్ గా పొందుపరిచామని చెప్పారు.

## పాతబస్తీలో దారుణం..వ్యక్తి దారుణ హత్య

హైదరాబాద్, డిసెంబర్ 21:హైదరాబాద్-పాతబస్తీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తిని హత్య చేసి పెట్రోల్ పోసి తగులబెట్టారు. హైదరాబాద్ కులుసుంపుర పోలీస్ స్టేషన్ పరిధిలో అనిల్ కుమార్ (35) అనే వ్యక్తిని జియగుడాకు చెందిన గోపి గ్యాంగ్ పాత క్షకల కారణంగా దారుణ హత్యకు పాల్పడింది.హత్య చేసి బెడ్ షీట్ లో చుట్టి డస్ట్ బిన్ వద్ద మృతదేహాన్ని తగలబెట్టారు. నిన్న రాత్రి అనిల్ ను హత్య చేసిన గోపిఈ రోజు తెల్లవారు జామున జియగుడా సోన టిఫిన్ సెంటర్ ఎదురు వీధిలో డస్ట్ బిన్ వద్ద పెట్రోల్ పోసి నిప్పు తగలబెట్టాడు. ప్రస్తుతం పోలీసుల అదుపులో నిందితుడు గోపి ఉన్నాడు. అనిల్ హత్య చేసిన అనంతరం జియగుడాలో నిన్న అర్ధరాత్రి నరికిన చేతితో గోపి తిరిగాడని గుర్తించారు. ఇక ఘటనా స్థలానికి చేరుకున్న కులుసుంపుర పోలీసులు క్లూస్ టీమ్..దర్యాప్తు చేస్తున్నాయి. అటు అనిల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

## రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడిగా బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ అనుచరుడు సంజయ్ సింగ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 21: భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ ఇవాళ రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 47 ఓట్లలో సంజయ్ సింగ్‌కు 40 ఓట్లు పోలయ్యాయి. బ్రిజ్ భూషణ్ తమను లైంగికంగా వేధించినట్లు మహిళా రెజ్లర్లు ఆరోపించిన కేసులో ఆయన సమాఖ్య బాధ్యతల నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికల్లో అనితా షీరాన్ ఓటమి పాలయ్యారు. కామన్‌వెల్త్ క్రీడల్లో స్వర్ణం గెలిచిన అనితాకు టాప్ రెజ్లర్లు మద్దతు ఇచ్చారు. కానీ సమాఖ్య ఎన్నికల్లో మాత్రం బ్రిజ్ వర్గానికే పెద్ద పీట దక్కింది.

కాగా, ఉత్తరప్రదేశ్ రెజ్లింగ్ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా సంజయ్ సింగ్ గతంలో పనిచేశారు. 2019 నుంచి డబ్ల్యూఎఫ్ఐ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సంయుక్త కార్యదర్శిగా చేశారు. ఇక ఇదే ఎన్నికల్లో వైస్ ప్రెసిడెంట్ పోస్టు కోసం రేసులో ఉన్న మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ఓటమి పాలయ్యారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్స్, సెక్రటరీ జనరల్, ట్రెజరర్, జాయింట్ సెక్రటరీస్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పోస్ట్ లు సైతం బ్రిజ్ సన్నిహితులే గెలుపొందారు..

## తండ్రిని మించిన తనయుడిగా జగన్ పాలన- సజ్జల




అమరావతి, డిసెంబర్ 21:తండ్రిని మించిన తనయుడిగా సీఎం జగన్ పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, ఎంపీ నందిగం సురేష్, పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ? సామాజిక న్యాయం అమలు చేసిన ఘనత జగన్‌దేనన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి.. పేదల జీవితాల్లో వెలుగు తెచ్చిన నాయకుడు జగన్ అని పేర్కొన్నారు. పూర్తి పారదర్శకంగా సంక్షేమం పథకాలు అందించిన ఘనత జగన్‌దేనన్నారు. అవినీతికి తావులేకుండా, అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామని సజ్జల పేర్కొన్నారు. పేదల చేయి పట్టుకుని నడిపిస్తున్నారన్నారు.

ప్రతి గ్రామంలోనూ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆస్పత్రులు ఇలా అన్నీ అందుబాటులోకి తెచ్చారన్నారు. అన్నీ కళ్లముందే కనిపిస్తున్నాయన్నారు చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్నారు. జగన్ పాలన పారదర్శకంగా జరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల కోసం మారీచ శక్తులు మళ్లీ ఏకం అయ్యాయన్నారు.

# మూడు కీలక బిల్లులకు లోక్‌సభ ఆమోదం

**– భారత న్యాయ సంహిత, భారత నాగరిక సురక్ష సంహిత, భారత సాక్ష్య బిల్లులకు లోక్‌సభ ఆమోదం**
**– బ్రిటిష్ కాలం నాటి ఐసీపీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో అందుబాటులోకి రానున్న ఈ కొత్త చట్టాలు**

న్యూ డిల్లీ డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);బుధవారం లోక్‌సభలో మూడు కీలక బిల్లులు ఆమోదం పొందాయి. భారత న్యాయ సంహిత, భారత నాగరిక సురక్ష సంహిత, భారత సాక్ష్య బిల్లులకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. బ్రిటిష్ కాలం నాటి ఐసీపీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ యాక్ట్‌ల స్థానంలో ఈ కొత్త చట్టాలు అందుబాటులోకి రానున్నాయి. పార్లమెంట్ భద్రతా ఉల్లంఘనలపై నిరసనల నేపథ్యంలో 143 మంది ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్ మధ్య ఈ చట్టాలు ఆమోదించబడ్డాయి. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. వందేళ్ల వరకు ఈ చట్టాలు దేశంలో న్యాయ ప్రక్రియలో ఉపయోగపడతాయని అన్నారు. భారతీయత, భారత రాజ్యాంగం, ప్రజల శ్రేయస్సుకు ఈ మూడు కొత్త చట్టాలు ప్రాధాన్యతని ఇస్తాయని అమిత్ షా నొక్కి చెప్పారు. రేపు (గురువారం) రాజ్యసభలోనూ ఈ మూడు బిల్లుల్ని ప్రవేశపెట్టడం జరుగుతుందని అన్నారు. గత చట్టాలు 150 ఏళ్ళ క్రితం నాటివి అని.. ఈ కొత్త బిల్లులు న్యాయం చేయడానికి అని, శిక్షించడానికి కాదని స్పష్టం చేశారు. ప్రాథమిక హక్కులకు ప్రాధాన్యత కల్పించేలా ఈ చట్టాల్లో మార్పులు చేశామని అన్నారు. కొత్త క్రిమినల్ చట్టాలకు ఫుల్ స్టాప్ పెట్టే ప్రతి కామాను తాను దాటానని, ఇవి రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉన్నాయని తెలిపారు. కొత్త చట్టాల ప్రకారం.. నేర దర్యాప్తుకు కాలపరిమితి కేటాయించడం జరుగుతుంది. ఎవిడెన్స్ యాక్ట్ నుంచి 5 సెక్షన్లను, ముఖ్యంగా దేశద్రోహ సెక్షన్‌ను తొలగించారు. దేశానికి వ్యతిరేకంగా చేసే చర్యలకు శిక్షను కొనసాగింపు ఉంటుంది. మూక దాడికి ఏడేళ్ళ జైలు శిక్ష లేదా ఉరిశిక్ష విధిస్తారు. సాముహిక అత్యాచారినికి 20 ఏళ్ళ జైలు శిక్ష లేదా జీవితకాలం జైలు శిక్ష. డిజిటల్ ఎవిడెన్స్‌ను పరిగణలోకి తీసుకునేలా కొత్త చట్టాల్లో మార్పులు చేశారు. దేశద్రోహ కేసుకు జీవిత ఖైదు నుంచి ఏడేళ్ల జైలు శిక్షకు మార్చారు. నేరం చేసి పారిపోయిన వారు 90 రోజుల్లో లొంగిపోవాలి, లేకపోతే వారి తరపున ప్రభుత్వ న్యాయవాదిని పెట్టి, తీర్పుని వెలువరిస్తారు. దోషులను విదేశాల నుంచి తీసుకొచ్చి ఉరిశిక్ష వేస్తామని అమిత్ షా అన్నారు.

మైనర్ బాలికపై అత్యాచారానికి జీవిత ఖైదు, ఒకవేళ బాలిక చనిపోతే ఉరిశిక్ష విధిస్తారు. మహిళలకు ఈ–ఎఫ్ఐఆర్ నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. దర్యాప్తు, సోదాల్లో వీడియోగ్రఫీ తప్పనిసరి చేశారు. ఎవరైనా ఎక్కడి నుంచైనా జీరో ఎఫ్ఐఆర్ దాఖలు చేయవచ్చు, 24 గంటల్లో దానిని సంబంధిత పోలీస్ స్టేషన్‌కు మార్చుకోవచ్చు. నిరాధారంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో పెట్టుకోవడానికి వీలు లేదు. అరెస్ట్ అయిన వారి కేసు వివరాలను కుటుంబ సభ్యులకు తెలిపేందుకు ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఒక అధికారిని నియమించడం జరుగుతుంది. ఆర్థిక నేరస్తుల ఆస్తులను వేలం వేసి ప్రభుత్వ ఖజానాకు ఆ డబ్బును మళ్లిస్తారు. నేరం సందర్భంగా పట్టుకున్న వాహనాలను కోర్టు ద్వారా 30 రోజుల్లో అమ్మేయాలని నిర్ణయించారు. పోలీస్‌స్టేషన్స్ ఆధునీకరణ చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఏడేళ్ల జైలుశిక్ష పడే కేసుల్లో ఫోరెన్సిక్ టీమ్స్ దర్యాప్తు తప్పనిసరి చేయడం జరిగింది.

# ఉస్మానియా యూనివర్సిటీలో నిరుద్యోగుల ఆగ్రహం

**–కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రతుల దహనం**



హైదరాబాద్ డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఉస్మానియా యూనివర్సిటీలో నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రతులను నిరుద్యోగులు దహనం చేశారు.

నిరుద్యోగుల ఓట్లతో అధికారం చేపట్టిన 15 రోజులకే సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిరుద్యోగులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలల్లో రూ.4000 నిరుద్యోగ భృతి, ఉద్యోగ నియామకాలపై శ్వేత పత్రం విడుదల చేయకుంటే దాడులు చేస్తామని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మానవతారాయ్ హెచ్చరించారు. నిన్న శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తాము నిరుద్యోగ భృతి గురించి ఎన్నికల్లో ఎక్కడా హామీ ఇవ్వలేదని పేర్కొన్నారు. కానీ నిరుద్యోగ భృతి గురించి వారి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రస్తావించారని, ప్రియాంక గాంధీ కూడా ఓ సభలో వ్యాఖ్యానించారని నిరుద్యోగులు గుర్తు చేశారు. ఈ రెండు అంశాలకు సంబంధించిన ఆధారాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని తెలిపారు.

# ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలి



హైదరాబాదు డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: హైదరాబాదులో చలి పంజా విసురుతోందని, ఉష్ణోగ్రతల అత్యంత కనిష్ట స్థాయికి పడిపోతుండడంతో చలి తీవ్రత మరింత పెరిగిందని, పొగ మంచు, చలిగాలులతో ప్రజలు గజగజ వణికి పోతున్నారని గమనించిన మదర్ మేరీ చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ లిల్లీ మేరీ హైదరాబాదులోని మెట్రో స్టేషన్లు కింద పడుకుంటున్నటువంటి అనాధలకు దుప్పట్లను మరియు మాస్కులను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా లిల్లీ మేరీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకొని నిర్భాగ్యులను మరియు పేదలను అన్ని విధాలుగా అండగా నిలవాలని కోరారు.

# మహిళలకి ఉచిత బస్సులు పెట్టినంత మాత్రాన రాష్ట్రాలు మారిపోవు..

**–ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉద్యోగం ఇవ్వాలి**
**–బిసి సంక్షేమ సంఘ రాష్ట్ర నాయకురాలు మట్ట జయంతి గౌడ్**

హైదరాబాద్ డిసెంబర్21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); మహిళలకి ఉచిత బస్సులు పెట్టినంత మాత్రాన రాష్ట్రాలు మారిపోవు.. ఉచిత విద్య ఉచిత వైద్యం ఉద్యోగం అవి చాలు వీటిని ఉచితంగా ఇవ్వాలని బిసి సంక్షేమ సంఘ రాష్ట్ర నాయకురాలు మట్ట జయంతి గౌడ్ అన్నారు. మన రాష్ట్రంలోనే కాకుండా ఏ రాష్ట్రంలో నైనా కోరుకునేది ఒక్కటే ఉచితంగా ఇలాంటి పథకాలు చెందాల్సింది దివ్యాంగులకు వృద్ధులకు మాత్రమే... ఉచితంగా మహిళలకు బస్సు కేటాయిస్తే వాళ్ల నరదాలకు సంతోషాలకు వాళ్లు పాడుకుంటున్నారు దానివల్ల వచ్చే నష్టం ప్రతి ఒక్కరి మీద భారం పడుతుంది దాని విషయంలో ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రాణ త్యాగాలు చేసిన కుటుంబాలని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ప్రభుత్వానికి ఉంది నోటిఫికేషన్లు వేసిన తర్వాత కూడా ఉద్యోగులు రాక నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్న సందర్భాలు కూడా మనం చూసే తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపడతామని రాహుల్ గాంధీ గారితో పాటు రేవంత్ రెడ్డి కూడా చెప్పారు.. ఎన్నో సంవత్సరాల బీసీల ఆకాంక్ష కులగనన చేపట్టాలని... తెలంగాణ రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ అంశం అవసరం లేదు.. మహిళలు ధైర్యంగా తిరగాలి అనుకుంటే ప్రతి ఒక్కరికి భద్రత కల్పించలేరు ఏ ప్రభుత్వం కూడా తెలంగాణ ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీసింగ్ అనే అంశాన్ని తీసేయాలని బీచి మహిళా సంఘం తరపున మేము కోరుకుంటున్నామన్నారు. ఎప్పుడైతే తప్పు చేసేవాడికి భయం అనేది కలుగుతుందో అప్పటివరకు ఇలాంటి అరాచకాలు జరుగుతూనే ఉంటాయి.... ఈ కొత్త ప్రభుత్వం వీటన్నిటి పైన ఆలోచించి అందరి ఆకాంక్షలు నెరవేర్చాలని మేము కోరుకుంటున్నాం తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వానికి మట్ట జయంతి గౌడ్ ధన్యవాదాలు తెలిపారు.

# ప్రధానమంత్రి సంగ్రహాలయం విశేషాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 21:ప్రధానమంత్రి సంగ్రహాలయాన్ని 2022 ఏప్రిల్ 14న ప్రధానమంత్రి ప్రారంభించారు. భారతదేశ ప్రధాన మంత్రులందరి జీవిత విశేషాలను ఇది వివరిస్తుంది. సమాజంలోని ప్రతి తరగతి, ప్రతి శ్రేణి నాయకులకు దేశ నిర్మాణంలో సహకరించడానికి మన ప్రజాస్వామ్యం ఎలా అవకాశాన్ని అందించిందో చూపిస్తుంది.

ప్రధాన మంత్రి సంగ్రహాలయం రెండు భవనాల్లో విస్తరించిన కొత్త డిజిటల్ మ్యూజియం. భవనం–1లో పాత తీన్ మూర్తి భవనం, శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ గ్యాలరీ, రాజ్యాంగ గ్యాలరీలు, తోషఖానా, శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ ప్రైవేట్ విభాగం ఉన్నాయి. భవనం–2 లో శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి నుంచి డా.మన్మోహన్ సింగ్ వరకు అందరు ప్రధాన మంత్రులు తీసుకొచ్చిన సామాజిక, రాజకీయ, ఆర్థిక సంస్కరణలు, వారి వ్యక్తిగత జీవిత విశేషాలు ఉంటాయి. పధానమంత్రి సంగ్రహాలయంలో, సందర్శకులు మమేకమయ్యే 'అనుభూతి' అనే జోన్ ఉంది.

ఇక్కడ, సందర్శకులు 'ప్రధానమంత్రితో సెల్ఫీ', 'ప్రధానితో నడవడం', 'ప్రధానమంత్రి నుంచి లేఖ అందుకోవడం' వంటివాటితో పాటు దేశ నిర్మాణం, సాంకేతిక అద్భుతాలను ప్రదర్శించే వర్చువల్ హెలికాప్టర్ విహారాన్ని ఎంచుకోవచ్చు. తాము కోరుకునే ప్రధానమంత్రిని సందర్శకులు ఇక్కడ ఎంచుకోవచ్చు. అలాగే, విజన్ 2047 అభిప్రాయాల గోడ మీద తమ సందేశాన్ని రాయవచ్చు. 'యూనిటీ చైన్'లో, ఒక సమూహంలోని పెద్ద గోడపై తమ ఉనికిని నమోదు చేయవచ్చు. సంగ్రహాలయాన్ని ప్రజలు సాఫీగా సందర్శించేందుకు గోల్ఫ్ వాహనాలు, చక్రాల కుర్చీలు, మార్గదర్శకాలు/శ్రవణ మార్గదర్శకాలు, ఫలహారశాల, సావనీర్ దుకాణం కూడా ఉన్నాయి.

# వైసీపీ సీట్ల లొల్లి.. తాడేపల్లి పాలస్‌కు చేరిన గొడవ

అమరావతి డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: వైసీపీ సీట్ల లొల్లి తాడేపల్లి పాలస్‌కు చేరింది. సీట్ల విశయంలో ఎప్పుడు ఏమి వినాల్సి వస్తుందో అనే ఆందోళనలో వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. సమన్వయకర్తల మార్పులు చేర్పులపై ఇవాళ కూడా కసరత్తు జరుగనుంది. పెనుగొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ, పొన్నూరు ఎమ్మెల్యే కిలారు రోశయ్య, ఉమ్మారెడ్డి, చీఫ్ విప్ ప్రసాద్ రాజులు సీఎం క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. ఉభయ గోదావరి జిల్లాలల్లో కసరత్తు వికటించడంతో అధిష్టానం మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇప్పటికే రాయలసీమ సీట్లపై వైసీపీ అధిష్టానం కసరత్తు మొదలు పెట్టింది. ఈ క్రమంలో మంత్రి ఉషా శ్రీ చరణ్ క్యాంపు కార్యాలయానికి వచ్చారు. మంత్రి విశ్వరూప్‌కు తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి పిలుపు వెళ్లింది. దీంతో విశ్వరూప్‌తో పాటు అమలాపురం సీటు ఆశిస్తున్న శ్రీకాంత్ కూడా క్యాంప్ ఆఫీస్‌కు రానున్నారు. మరికొందరి మంత్రులు, ప్రజా ప్రతినిధులకు సీఎంఓ నుంచి పిలుపు వెళ్లింది. దీంతో మంత్రులు విశ్వరూప్, జయరాం సీఎంఓకు చేరుకోనున్నారు. ఎమ్మెల్యేలు రాపాక, చిట్టిబాబు, తిప్పల నాగిరెడ్డి. క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. మంత్రులు గుమ్మనూరు, ఎమ్మెల్యేలు రాపాక, నవాజ్ పాషా సీఎం క్యాంప్ ఆఫీస్‌కు చేరుకోగా.. మరికొంత మంది ఎమ్మెల్యేలు తాడేపల్లి సీఎంవోకు రానున్నారు.

# ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి -జిల్లా కలెక్టర్ రాజర్షి షా

మెదక్, డిసెంబర్ 20:(నేటినిజం ప్రతినిధి):ఇంటర్ విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల నీ ,మెదక్ జిల్లాను, రాష్ట్రనీ లోనే మొదటి స్థానం లో ఉంచాలని ,జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఇంటర్ కాలేజ్ అధికారులను అదేశించారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్ లో గురువారం ఇంటర్ కళాశాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరో రెండు నెలల్లో పబ్లిక్ పరీక్షలు దగ్గర గా ఉన్నాయని విద్యార్థులు, తల్లితండ్రులు , అధ్యాపకులు సమిష్టిగా ఇంటర్ లో మంచి పలితలకోసం ప్రయత్నం చేయాలన్నారు. విద్యార్థులు , ఫోన్ ఇతర సోషల్ మీడియా లకు దూరం గా ఉండి తల్లితండ్రుల కష్టానికి ఫలితం అందించాలన్నారు .మెదక్ జిల్లా లో ఉన్న అన్ని కళాశాలల్లో ఈ నెల 28 న పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించాలని, విద్యార్థులను అఃఅఆ గ్రూప్ గా విబజించమని ,అ,ఆ గ్రూప్ విద్యార్థుల తల్లిదండ్రులు కచ్చితంగా హాజరు కావాలన్నారు. జనవరి 1 వ తేదీ నుంచి ఇంటర్ విద్యార్థుల లకు స్పెషల్ స్టడీ అవర్స్ ,స్పెషల్ స్లిప్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు .డిసెంబర్ నెలాఖరు వరకు సిలబస్ పూర్తి చేయాలన్నారు. మెదక్ జిల్లా లో ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి స్టడీ మెటీరియల్ అందించమన్నారు. చదువుల్లో వెనకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలన్నారు. విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత కోసం, సబ్జెక్ట్ వారీగా, అర్హులైన ,అనుభవం గల సబ్జెక్ట్ నిపుణులు శ్రద్ధ చూపాలన్నారు. కళాశాలల్లో తల్లితండ్రుల తో సమావేశాలు ఏర్పాటు చేయాలని, డ్రాప్ఔట్ శాతం తగ్గించలని కళాశాల అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ రమేష్ జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ, ఆఖా రాధా కిషన్ తదితరులు పాల్గొన్నారు

# లింగ మార్పిడిదారులకు సాధికారత: సమ్మిళిత కథల చిహ్నం విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర

న్యూఢిల్లీ, డిసెంబర్ 21:'విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర' భారతదేశం అంతటా ఆశల కలనేత, మిలియన్ల మంది ప్రజలను కలుపుతూ మరియు అభివృద్ధి స్ఫూర్తిని పెంపొందించింది. ఇది విభిన్న నేపథ్యాల నుండి అసంఖ్యాక వ్యక్తులను కలుపుతుంది, ఉజ్వల భవిష్యత్తు కోసం సామూహిక కలను ప్రోత్సహిస్తుంది.

గణాంకాలు పురోగతి చిత్రాన్ని చిత్రించగలవు కొన్ని కథలు మన భావోద్వేగాలతో లోతుగా ప్రతిధ్వనిస్తాయి. క్యాటరింగ్ ప్రపంచంలో విజయవంతమైన మార్గాన్ని చెక్కిన లింగ మార్పిడి వ్యక్తి నీలేష్ కథ అలాంటిది.

పీ ఎం వీధి వ్యాపారుల ఆత్మ నిర్భర్ నిధి ( పీ ఎం స్వనిధి) యోజన ద్వారా, మహారాష్ట్రలోని వార్ధా నివాసి నీలేష్ రూ. 10,000 రుణాన్ని పొందారు, ఇది స్ఫూర్తిదాయకమైన వ్యవస్థాపక ప్రయాణానికి ఉత్ప్రేరకంగా పనిచేసింది. నీలేష్ అనేక ప్రారంభ సవాళ్లను ఎదుర్కొన్నారు, అయితే అచంచలమైన సంకల్పం మరియు సానుకూల దృక్పథం ఆమె అభివృద్ధి చెందుతున్న క్యాటరింగ్ వ్యాపారాన్ని స్థాపించడంలో సహాయపడింది. నీలేష్ క్యాటరింగ్ వ్యాపారాన్ని స్థాపించడమే కాకుండా, ట్రాన్స్‌జెండర్లు మరియు మహిళలు ఆర్థిక సాధికారత కోసం సహకరించే స్వయం సహాయక బృందాన్ని 'మోహిని బచత్ గాట్'ని ఏర్పాటు చేయడం ద్వారా ఇతరులకు స్ఫూర్తినిచ్చారు. నీలేష్ కథ సామాజిక అడ్డంకులను అధిగమించడానికి మరియు వారి కలలను వెంబడించడానికి ఇతరులను ప్రేరేపిస్తుంది. నీలేష్ తన సామర్థ్యాన్ని వెలికితీసేందుకు మరియు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించడానికి లభించిన ఒక ''వరం''గా ప్రధానమంత్రి స్వనిధి పథకాన్ని కీర్తించారు.

మోనా ప్రయాణం చండీగఢ్‌లో ప్రారంభమైంది, అక్కడ ఆమె ఒక చిన్న టీ స్టాల్‌తో నిలకడైన మరియు స్వావలంబన యొక్క జ్యోతిని వెలిగించింది. పీ ఎం వీధి వ్యాపారుల ఆత్మ నిర్భర్ నిధి (పీ ఎం స్వనిధి) పథకం నుండి రూ. 10,000 రుణంతో సామానులు పొందారు, ఒక చిన్న టీ స్టాల్ ఆమెకు ఆర్థిక స్వాతంత్ర్య మార్గాన్ని ప్రారంభించడానికి వీలు కల్పించింది. ఆమె తర్వాత రూ. 20,000 మరియు రూ. 50,000 చొప్పున మరో రెండు రుణాలు అందుకుంది, అది ఆమె ప్రయాణాన్ని బలోపేతం చేసింది. పీ ఎం స్వనిధి మోనాను సామాజిక దురభిప్రాయాలచే నియంత్రించబడే జీవితం నుండి తప్పించుకోవడానికి మరియు లింగమార్పిడి సమాజాన్ని తరచుగా పట్టించుకోని ప్రపంచంలో తనకంటూ ఒక స్థానాన్ని రూపొందించుకోవడానికి అనుమతించింది.

నీలేష్ మరియు మోనాల ప్రగతి ప్రస్థానాలు కేవలం వ్యక్తిగత విజయాలు మాత్రమే కాదు; వారు జీవనయానం ద్వారా సాధ్యమైన అనుభవాలను పంచుకునే సమయంలో అభివృద్ధి మరియు సాధికారత యొక్క విస్తృత దృశ్యాన్ని చిత్రీకరిస్తారు. ప్రధానమంత్రి స్వనిధి పథకం వీధి వ్యాపారులను సాధికారిక ఆర్థిక రంగంలోకి తీసుకురావడంలో కీలకపాత్ర పోషించి, పైకి ఎదగడం కోసం సరికొత్త మార్గాలను అందించింది. డిసెంబర్ 20 నాటికి, పీ ఎం స్వనిధి పథకం నుండి 57 లక్షల మందికి పైగా ప్రయోజనం పొందారు. ప్రగతి అనేది కేవలం సంఖ్యాపరమైన మైలురాళ్లకు సంబంధించినది కాదని, వ్యక్తులు తమ పూర్తి సామర్థ్యాన్ని వెలికితీసేందుకు వీలు కల్పిస్తుందని, సుసంపన్నమైన భారతదేశానికి గణనీయంగా దోహదపడుతుందని అవి జ్ఞాపికలుగా పనిచేస్తాయి. విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర అనుసంధానం మరియు సాధికారత కోసం దాని సంకల్పం కొనసాగుతుంది కాబట్టి, ప్రతి ఒక్కరికీ ఉజ్వల భవిష్యత్తు వైపు మనల్ని ప్రేరేపించడంలో మరియు నడిపించడంలో ఇటువంటి కథలు కొనసాగుతాయని మనం నమ్మకంగా ఊహించవచ్చు.

# ఆపదలో ఉన్న రోగులను అండగా ఉంటాం: మంత్రి కొండ సురేఖ



హన్మకొండ డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హన్మకొండ జిల్లాలోని రెడ్డి కాలనీకి చెందిన మహమ్మద్ నసిమ్ హైమద్ దంపతులకు ఇద్దరు అబ్బాయిలు. చిన్న అబ్బాయి ఎండీ ఆదిల్ హైమాద్ కు కొంత కాలంగా బోన్ క్యాన్సర్ తో బాధ పడుతున్నారు.. లక్షలలో వైద్యం చేయించలేక పేదరికంతో బాధపడుతున్న ఆ కుటుంబం మంత్రి కొండ సురేఖ కు కలిసి వారి భాదను విన్నవించారు.. చలించిపోయిన మంత్రి కొండ సురేఖ వెంటనే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి సమస్య తీవ్రతను తెలియజేశారు.

వెనువెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సంబంధిత అధికారులకు చెప్పి వారికి అయ్యే ఖర్చు ప్రభుత్వం భరిస్తుంది అని హామీ ఇచ్చారు.. పేద ప్రజల వైద్యానికి మన ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆపదలో ఉన్న రోగులను ఆదుకునేందుకు అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మన ప్రభుత్వం పని చేస్తుందని ఆర్థిక స్థోమత కారణంగా ఎవరు దిగులుపడవద్దు వారికి మన ప్రజా ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి అండగా వున్నారు అని మంత్రి సురేఖ అన్నారు.

# లోక్‌సభలో భద్రతా వైఫల్యం..

**–పోలీసుల అదుపులో మాజీ పోలీసు ఉన్నతాధికారి కుమారుడు**

న్యూ డిల్లీ డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );శీతాకాల సమావేశాలు జరుగుతున్న సమయంలో పార్లమెంట్‌లో భారీ భద్రతా లోపం బయట పడిన విషయం తెలిసిందే. లోక్‌సభలోకి ఇద్దరు దుండగులు ప్రవేశించి కలర్ స్మోక్ వెదజల్లడం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపడుతున్నారు. ఇప్పటికే ఆరుగురు అనుమానితుల్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మరో ఇద్దరు వ్యక్తులను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు బెంగళూరుకు చెందిన టెకీ కాగా, మరొకరు ఉత్తరప్రదేశ్‌లోని జలౌన్‌కు చెందిన అతుల్‌గా గుర్తించారు. ఆ ఇద్దరిలో టెకీని కర్ణాటకలోని బాగల్‌కోట్ కు చెందిన రిటైర్డ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కుమారుడు సాయికృష్ణ గా గుర్తించారు. డిసెంబర్ 13న లోక్‌సభ చాంబర్‌లోకి చొరబడిన మనోరంజన్‌కు సాయికృష్ణ స్నేహితుడు అని సంబంధిత వర్గాలు తెలిపాయి. సాయికృష్ణ, మనోరంజన్‌లు బెంగళూరులోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో బ్యాచ్‌మేట్స్‌గా గుర్తించినట్లు వెల్లడించాయి. ప్రస్తుతం వర్క్‌ఫ్రం హోం చేస్తున్న సాయికృష్ణను ఢిల్లీ పోలీసులు బుధవారం రాత్రి 10 గంటల సమయంలో బాగల్‌కోట్‌లోని అతని నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం సాయికృష్ణను ఢిల్లీకి తీసుకొచ్చారు. కాగా, పార్లమెంట్‌లో భద్రతా ఉల్లంఘనకు సంబంధించి ఇప్పటికే ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అరెస్టయిన నిందితుల్లో లోక్‌సభలోకి చొరబడిన మనోరంజన్, సాగర్ శర్మ, పార్లమెంటు వెలుపల పొగ డబ్బాలు ఉపయోగించిన అమోల్ షిండే, నీలం ఆజాద్‌లు ఉన్నారు. లలిత్ ఝా భద్రతా ఉల్లంఘనకు ప్రధాన సూత్రధారిగా పోలీసులు గుర్తించారు. లలిత్‌తోపాటు అతనికి సాయం చేసిన మహేష్ కుమావత్‌ను కూడా ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# వికసిత భారత సంకల్ప యాత్రలో మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న పథకాల నమోదు



న్యూఢిల్లీ, డిసెంబర్ 21:వికసిత భారత సంకల్ప యాత్రలో మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న పథకాల కోసం 63,000 మంది తమ పేర్లు నమోదు చేసుకుని ప్రభుత్వ పథకాల పట్ల నమ్మకాన్ని ప్రదర్శించారు.

పిల్లలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడం ఒక లక్ష్యంగా వికసిత భారత సంకల్ప యాత్ర జరుగుతోంది. పిల్లల ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించి రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. యాత్రలో భాగంగా నిర్వహించిన ఆరోగ్యకరమైన పిల్లల పోటీలో 57000 కంటే ఎక్కువ మంది పిల్లలు పాల్గొన్నారు.

వికసిత భారత సంకల్ప యాత్రలో పాల్గొంటున్న వారిలో 50% మంది మహిళలు ఉంటున్నారు. అభివృద్ధి సాధన, సాధికారత కోసం మహిళలు చేస్తున్న కృషికి ఇది నిదర్శనం గా ఉంటుంది.

దేశవ్యాప్తంగా జరుగుతున్న వికసిత భారత సంకల్ప యాత్రలో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ చురుకుగా పాల్గొంటోంది. మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో "మేరీ కహానీ మేరీ జుబానీ (ఓఐఓజి)"కార్యక్రమం ప్రతి యాత్రలో నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి చెందిన లబ్ధిదారులు వారి అనుభవాలు, వారి జీవితాలపై అంగన్‌వాడీ సేవలు చూపిన ప్రభావం గురించి వివరిస్తున్నారు.




# పారా అథ్లెట్లకు మరింత మెరుగైన సహకారాన్ని అందించడానికి ఖేలో ఇండియా

న్యూఢిల్లీ, డిసెంబర్ 21:ఖేలో ఇండియా పారా గేమ్స్ సందర్భంగా న్యూఢిల్లీలో రవాణా మరియు మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడానికి యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ యొక్క ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్ ఖేలో ఇండియా, భారతదేశం యొక్క అగ్రగామి యాక్సెసిబిలిటీ ఆర్గనైజేషన్ అయిన స్వయం కలిసి పనిచేయడానికి చేతులు కలిపాయి.

ఖేలో ఇండియా పారా గేమ్స్ పాల్గొనే1400 కంటే ఎక్కువ మంది పారా- అథ్లెట్లకు అందుబాటులో ఉండే రవాణా సేవలు అందించబడ్డాయి. 8 రోజుల పాటు జరిగే ఈ ఈవెంట్ ప్రారంభంలో 300 కంటే ఎక్కువ మంది వలంటీర్లు మరియు ఆటలకు సంబంధించిన అధికారులు అవగాహన కల్పించారు. అన్ని పారా-అథ్లెట్లు, పారా -అఫీషియల్స్ మరియు పారా-కోచ్‌ల కోసం రైల్వే స్టేషన్‌లు, బస్ స్టేషన్‌లు మరియు ఎయిర్‌పోర్ట్‌తో సహా నగరానికి చేరుకోవడం నుండి బయలుదేరే వరకు అందుబాటులో ఉండే బస్సులు మరియు మినీవ్యాన్‌లు సిద్ధంగా ఉంచబడ్డాయి. ఇంకా, ఏర్పాట్లు చేసేటప్పుడు వసతి (హోటల్‌లు/ హాస్టల్‌లు) మరియు సంబంధిత స్టేడియంల మధ్య కూడా రవాణా సదుపాయం కలువబడుతుంది.

ఖేలో ఇండియా పారా గేమ్స్ 2023లో 500 కంటే ఎక్కువ మంది వీల్‌చైర్ ఉపయోగించే క్రీడాకారులు పాల్గొన్నారు. అందువల్ల, వారికి అందుబాటులో ఉండే మౌలిక సదుపాయాలను అందించడం అత్యంత ప్రాధాన్యత అంశంగా మారింది. ఇది కేవలం హ్యాండ్‌రైల్‌ల తో కూడిన ర్యాంప్‌లు మాత్రమే కాకుండా అందుబాటులో ఉండే టాయిలెట్‌లు, యాక్సెస్ చేయగల సీటింగ్ మరియు పారా ప్లేయర్‌లు మరియు ప్రేక్షకుల కోసం యాక్సెస్ చేయగల పార్కింగ్‌లు కూడా అందుబాటులో ఉంచారు. ఒక క్రీడాకారుడు వీల్‌చైర్‌ని ఉపయోగిస్తున్నా, దృష్టి లోపం కలిగి ఉన్నా లేదా ఇతర సవాళ్లను ఎదుర్కొంటున్నా, అందుబాటులో ఉన్న యాక్సెసిబిలిటీతో, వారు అందరిలాగే క్రీడలను ఆస్వాదించగలుగుతారు. ఈ సదుపాయాల ద్వారా ఖేలో ఇండియా ప్రతి ఒక్కరూ తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి అనుమతించింది.

పారాలింపిక్ రజత పతక విజేత భావినా పటేల్ మాట్లాడుతూ.. సమగ్ర మౌలిక సదుపాయాలు మరియు అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థ.. అంటే ఒక పారా-ప్లేయర్ కోసం ర్యాంప్‌లు మరియు నిర్దేశిత స్థలాల కంటే ఎక్కువ. ఇది మాకు సమాన అవకాశాల స్థలాన్ని అందిస్తుంది. చాలా మంది ప్రజలు యాక్సెస్ చేయగల రవాణా యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకోలేరు. కానీ పారా-ప్లేయర్‌లుగా ఈ క్రీడా ఈవెంట్‌ల సమయంలో యాక్సెస్ చేయగల వ్యాన్ లేదా బస్సును అందించినప్పుడు మనం ఎంత గౌరవంగా మరియు సురక్షితంగా ఉంటామో ప్రత్యక్షంగా అనుభవించాము. అదేవిధంగా, ఆటల వద్ద అనువైన టాయిలెట్లను అందుబాటులోకి తెచ్చే విధంగా, వాటిని అన్ని సౌకర్యాలలో అంతర్భాగంగా చేయాలి. ఖేలో ఇండియా మరియు స్వయం ఈ బాధ్యతను చేపట్టి మైదానంలో అందుబాటులోకి తెచ్చినందుకు నేను నిజంగా అభినందిస్తున్నాన'న్నారు.

సురక్షితమైన మరియు గౌరవప్రదమైన అనుభవాన్ని నిర్ధారించడానికి అందుబాటులో ఉండే వాతావరణం యొక్క ఆవశ్యకతను గుర్తిస్తూ, పారా-అథ్లెట్లు, అధికారులు మరియు కోచ్‌ల రాకపోకలకు- అది రైల్వే స్టేషన్‌లు, బస్ స్టేషన్‌లు కావచ్చు లేదా విమానాశ్రయం అందుబాటులో ఉండే బస్సులు మరియు మినీవ్యాన్‌ల సముదాయాన్ని అందుబాటులో ఉంచారు. వీటికి అదనంగా క్రీడాపోటీలు జరిగే అన్ని ప్రాంతాల్లో ప్రతి పారా-అథ్లెట్‌కు సహకారం అందించడంపై అధికారులు మరియు వలంటీర్‌లకు అవగాహన కల్పించడానికి ఆటలకు ముందు బహుళ వర్క్‌షాప్‌లు నిర్వహించబడ్డాయి. స్వయం నిర్వహించే చలనశీలత తగ్గిన వ్యక్తులతో సరైన ప్రవర్తన మరియు సంభాషణలో శిక్షణ వల్ల పారా అథ్లెట్లు ఆటలో భాగస్వాములను చేయడమే కాకుండా వారి గౌరవాన్ని పెంపొందించింది. ఇది వారి శారీరక సామర్థ్యాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ సహాయక, స్వాగతించే వాతావరణాన్ని నిర్ధారిస్తుంది. అందరిలో తాదాత్మ్యం మరియు అవగాహనను ప్రోత్సహిస్తుంది.

ఖేలో ఇండియా, స్వయం మధ్య సహకారం వల్ల భారతదేశంలో అందుబాటులో ఉండే క్రీడా వాతావరణాన్ని సృష్టించేందుకు ఒక ముఖ్యమైన అడుగుగా మారింది. శారీరక సామర్థ్యాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ దేశాన్ని ఏకం చేసే క్రీడల్లో పాల్గొనడం, పోటీపడడం మరియు ఉత్సాహంగా ఉండేలా చూడాలనే అంకితభావాన్ని ఈ రెండింటి కలయిక ప్రతిబింబిస్తుంది

# 'ఇండస్ట్రీ 4.0'పై అవగాహన కార్యక్రమాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 21:ఇండస్ట్రీ 4.0 గురించి భారతీయ తయారీ పరిశ్రమల్లో అవగాహన పెంచడానికి సెమినార్లు, శిక్షణ కార్యక్రమాలు, కార్యశాలల నిర్వహణ కోసం, "ఎన్‌హాన్స్‌మెంట్ ఆఫ్ కాంపిటీటివ్‌నెస్ ఇన్ ది ఇండియన్ క్యాపిటల్ గూడ్స్ సెక్టార్" పథకం కింద, ప్రాజెక్టు అమలు సంస్థలు (పిఐఏలు), పారిశ్రామిక సంఘాలకు భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆర్థిక సాయం అందిస్తోంది.

ఈ పథకం కింద, ఇండస్ట్రీ 4.0పై అవగాహన పెంచడానికి 2021-22, 2022-23 సంవత్సరాల్లో వివిధ ప్రాజెక్టు అమలు సంస్థలు, పారిశ్రామిక సంఘాల ద్వారా 195 సెమినార్లు/శిక్షణ కార్యక్రమాలు/ కార్యశాలలు నిర్వహించారు. వీటిలో 9,000 మంది నిపుణులు పాల్గొన్నారు.

పుణెకు చెందిన సీ4ఐ4 ల్యాబ్ సాంకేతిక సహకారంతో, 7 అక్టోబర్ 2022న, గుజరాత్‌లోని కేవడియాలో "ఇండస్ట్రీ 4.0పై జాతీయ సదస్సు"ను మంత్రిత్వ శాఖ నిర్వహించింది. ఐఐఎస్‌సీ, సీఎంటీఐ సాంకేతిక సహకారంతో 03-04 జులై 2023న బెంగళూరులో "నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ రోబోటిక్స్" అంశంపై సమావేశం నిర్వహించారు.

పరిశ్రమలు తమ కార్యకలాపాల్లో ఇండస్ట్రీ 4.0ను స్వీకరించేందుకు ఎస్‌ఎంఈలతో సహా పరిశ్రమ నిపుణులందరికీ శిక్షణ కార్యశాలలు నిర్వహిస్తారు.

"ఎన్‌హాన్స్‌మెంట్ ఆఫ్ కాంపిటీటివ్‌నెస్ ఇన్ ది ఇండియన్ క్యాపిటల్ గూడ్స్ సెక్టార్" పథకంలోని "కామన్ ఇంజినీరింగ్ ఫెసిలిటీ సెంటర్స్" కింద, సమర్థ్ కేంద్రాలు, ఇతర ప్రాజెక్టు అమలు సంస్థలు తయారీ రంగంలో ఇండస్ట్రీ 4.0ను చేర్చడానికి ఎస్ఎంఈలు, ఎంఎస్‌ఎంఈలు, నిపుణులకు శిక్షణ ఇస్తున్నాయి.

# ప్రధాన మంత్రి ఉజ్వల యోజన: పొగ రహిత వంటశాలల కల సాకారం

న్యూఢిల్లీ, డిసెంబర్ 21:పీఎం ఉజ్వల యోజన కింద ఎల్పీజీ సిలిండర్‌ను పొందిన తర్వాత తమ జీవితాల్లో జరిగిన మార్పును పలువురు మహిళా లబ్ధిదారులు ప్రస్తుతం కొనసాగుతున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో పంచుకున్నారు. ఇందులో విశేషమేమిటంటే ఎల్పీజీ సిలిండర్‌ను అందించడం వంటి సాధారణ విషయం దేశవ్యాప్తంగా అనేక మంది మహిళలకు బహుళ ప్రయోజనాలను తెచ్చిపెట్టింది. సాంప్రదాయ వంట చెరకుతో చేసే వంటలో ఉండే అనారోగ్య పొగ నుండి విముక్తి పొందడం పట్ల కొందరు సంతోషిస్తారు. అలాగే ఇంకొంతమంది కట్టెలు సేకరించడానికి పడిన సమయం మరియు శ్రమను ఆదా చేయగలుగుతారు.

యాత్ర మొదలైన తొలి నెలలోనే దాదాపు 3.77 లక్షల మంది మహిళలు ఈ పథకం కోసం నమోదు చేసుకున్నారు. 2016లో ప్రారంభించినప్పటి నుండి ఈ పథకం కింద ఇప్పటికే లబ్ధి పొందిన కోట్లాది మందితో పాటు..యాత్రలో పలువురు మహిళలు పంచుకున్న అనుభవాలను పరిశీలిస్తే ఒకరు ప్రధానమంత్రి ఉజ్వల యోజన కోట్లాది మంది మహిళలకు మెరుగైన జీవన నాణ్యతను తీసుకురావడానికి నిజంగా గొప్ప గేమ్ ఛేంజర్ అని సురక్షితంగా నిర్ధారించవచ్చు. అందులో భాగంగా షిమా కుమారి మరియు బచన్ దేవిల సాక్ష్యాలను పరిశీలించవచ్చు.

ఉత్తరప్రదేశ్‌లోని చందౌలీ జిల్లాకు చెందిన సీమా కుమారి తన వంట గదిలో రోజూ సవాళ్లను ఎదుర్కొనేది. అనేక భారతీయ గృహాల మాదిరిగానే శ్రీమతి సీమా కుమారి సంప్రదాయ వంట పద్ధతులకు కట్టుబడి ఉంది. ఆమె ప్రతిరోజూ కట్టెలు సేకరించవలసి ఉండేది. వంటనుండి వెలువడే పొగ కారణంగా ఆమె తలనొప్పితో బాధపడేది అలాగే ఈ సాంప్రదాయ వంట పద్ధతులతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంది. కట్టెలతో వంట చేయడానికి సమయం కూడా ఎక్కువగా పడుతుంది. ఈ దినచర్య ఆమెకు కష్టతరంగా మారింది. పొగ రహిత వంటగది ఆలోచన ఆమెకు సుదూర కలలా అనిపించింది.

అయితే, 'ప్రధాన మంత్రి ఉజ్వల యోజన' ద్వారా ప్రభుత్వం సకాలంలో జోక్యం చేసుకోవడం ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. ఎల్పీజీ సిలిండర్‌ను పొందిన తర్వాత ఆమె వంటగది రూపాంతరం చెందింది. పొగ నుండి ఆమెకు విముక్తి లభించింది. ఎల్పీజీ సిలిండర్‌తో ఆమె ఇప్పుడు త్వరగా భోజనం వండగలదు. సమయానుకూలంగా మరియు అవాంతరాలు లేని వంటను పొందగలదు. ఈ సౌలభ్యం ఆమె పిల్లలకు భోజనాన్ని తయారు చేయడం చాలా సులభం చేసింది. తన జీవితాన్ని గణనీయంగా మెరుగుపరిచినందుకు ఈ అమూల్యమైన సహాయానికి షిమా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

అదేవిధంగా జమ్మూ కాశ్మీర్‌లోని కథువా జిల్లాకు చెందిన బచన్ దేవి కూడా ఇలాంటి పోరాటాలను చవిచూసింది. కట్టెలు సేకరించడం మరియు హడావుడిగా భోజనం సిద్ధం చేయడం వంటి ఇబ్బందులు ఆమెకు దూరమయ్యాయి. గతంలో ఆమెకు వంట చేయడం అనేది అంతం లేనిదిగా అనిపించే సవాలుతో కూడిన దినచర్య. శ్రీమతి బచన్ దేవి ఈ కష్టాల నుండి బయటపడే మార్గం లేదని భావించినప్పుడు ప్రధానమంత్రి ఉజ్వల పథకం ఆమె జీవితంలో ఊహించని సానుకూల మార్పును తీసుకొచ్చింది. ఈ పథకం కింద గ్యాస్ సిలిండర్ అందుకోవడం ఆమె జీవితాన్ని మార్చింది. శ్రీమతి బచన్ దేవి సిలిండర్ కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఎనలేని కృతజ్ఞతలు తెలియజేస్తుంది. ఈ పథకం ద్వారా ఆమె కట్టెలు సేకరించే పని నుండి విముక్తి పొందింది. ఈ కొత్త సౌలభ్యం ఆమె తన పిల్లలకు సకాలంలో భోజనం వండటానికి వీలు కల్పిస్తుంది. అలాగే ఆమెకు వంట కష్టం నుండి విముక్తి కల్పించింది.

ప్రధాన మంత్రి ఉజ్వల యోజన తీసుకొచ్చిన విప్లవానికి ముందు కోట్లాది గృహాలు సాంప్రదాయ వంట ఇంధనాలైన కట్టెలు, బొగ్గు మరియు ఆవు పేడ పిడకలను ఉపయోగించవలసి వచ్చింది. భారతీయ మహిళలు పొగవెలువడే వంటశాలలలో భోజనం తయారు చేయడం వల్ల దగ్గు మరియు రోజంతా ఊపిరి పీల్చుకోవడానికి కష్టపడటం సర్వసాధారణం. ఇది వారి ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడమే కాకుండా పర్యావరణ ఆందోళనలకు కూడా దోహదపడింది.

చాలా మంది మహిళలు, పొగ మరియు హానికరమైన కణాల మధ్య ఎప్పుడైనా ప్రత్యామ్నాయాన్ని కనుగొనాలనే ఆశను వదులుకున్నారు. అయితే గ్రామీణ మరియు వెనుకబడిన కుటుంబాలకు ఎల్పీజీ వంటి స్వచ్ఛమైన వంట ఇంధనాన్ని అందుబాటులో ఉంచడానికి భారత ప్రభుత్వం మే 2016లో ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై)ని ప్రారంభించింది. ఈ చొరవ తరతరాలుగా కష్టాలను అనుభవించిన భారతీయ మహిళలకు ఒక విముక్తి అనుభవాన్ని అందించింది. తద్వారా చివరకు పొగ రహిత వంటగది కలను సాకారం చేసింది.

సీమా కుమారి మరియు బచన్ దేవి కథలు భారతదేశం అంతటా లెక్కలేనన్ని స్త్రీలతో ప్రతిధ్వనించాయి. వారి పేర్లు, సంస్కృతులు మరియు నేపథ్యాలు భిన్నంగా ఉన్నప్పటికీ వారు ఉమ్మడి భావోద్వేగాన్ని పంచుకుంటారు. వారంతా సంవత్సరాల పోరాటం నుండి ఉపశమనం మరియు వారి జీవితంలో సానుకూల మార్పు కోసం కృతజ్ఞతా భావాన్ని కలిగి ఉంటారు

# సీనియర్ సిటిజెన్లకు ప్రధాన సేవలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 21:సామాజిక న్యాయం, సాధికారత విభాగం నిర్వహించే అటల్ వయో అభ్యుదయ యోజన (ఎవివైఎవై) అనే పథకం కింద సీనియర్ సిటిజెన్లకు ఆర్థిక భద్రత, ఆరోగ్యం, పౌష్టికాహారం, ఆశ్రయం, సంక్షేమం తదితరాలను అందిస్తున్నారు. అటువంటి ఒక ఉపకరణం, ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఫర్ సీనియర్ సిటిజెన్స్ (ఐపిఎస్ఆర్‌సి - సీనియర్ సిటిజెన్లకు సమగ్ర కార్యక్రమం) కింద, నిరుపేద వృద్ధులకు ఆశ్రయం, ఆహారం, వైద్యం, వినోద అవకాశాలు మొదలైన ప్రాథమిక సౌకర్యాలు ఉచితంగా అందించే సీనియర్ సిటిజెన్ హోమ్‌ల నిర్వహణ, నడపడం కోసం అమలు ఏజెన్సీలకు ఆర్థిక సహాయం అందిస్తారు. రాష్ట్రీయ వయోశ్రీ యోజన (ఆర్‌విై) కింద దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్న లేదా నెలకు రూ. 15000 ఆదాయం ఉండి, వయసుకు సంబంధించిన వైకల్యాలతో బాధపడుతున్న సీనియర్ సిటిజన్లకు శిబిరాలు నిర్వహించి జీవన సహాయక పరికరాలను ఉచితంగా పంపిణీ చేస్తారు.

ఎల్డర్‌లైన్: సీనియర్ సిటిజన్ల జీవన నాణ్యతను మెరుగుపరచేందుకు సీనియర్ సిటిజెన్ల కోసం జాతీయ హెల్ప్‌లైన్ (ఎన్‌హెచ్‌ఎస్‌సి) (టాల్ ఫ్రీ నెం. 14567) అన్నవి ఉచిత సమాచారం, మార్గదర్శనం, ఉద్వేగపరమైన మద్దతుతో పాటుగా అత్యాచారాలు జరుగుతున్న కేసుల్లో జోక్యం చేసుకుని,కాపాడతారు. సీనియర్ -కేర్- ఏజియింగ్ గ్రోత్ ఇంజిన్ (ఎస్ఏజిఇ ) అన్నది వృద్ధుల సమస్యల గురించి ఆలోచించి, వారి సంరక్షణ కోసం వినూత్న భావనలను ఆవిష్కరించమని యువతను ప్రోత్సహించడమే కాక ఈక్విటీ సపోర్ట్‌ను అందించడం ద్వారా వాటిని స్టార్టప్‌లుగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తారు.

కేంద్ర గ్రామీణాభివృద్ధి విభాగం కింద కేంద్ర ప్రాయోజిత పథకమైన జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్ఎస్ఏపి)కి చెందిన ఇందిరాగాంధీ నేషనల్ ఓల్డ్ ఏజ్ పెన్షన్ స్కీం (ఐజిఎన్ఓఎపిఎస్) కింద, దారిద్ర్య రేఖకు దిగువన (బిపిఎల్)గల కుటుంబాలకు చెందిన 60-79 సంవత్సరాలు వయస్సు గల వృద్ధులలో ప్రతి లబ్ధిదారునికి నెలకు రూ. 200/ - చొప్పున నెలవారీ పింఛను చెల్లిస్తున్నారు. వారి వయసు 80 ఏళ్ళకు చేరుకున్న తర్వాత లబ్ధిదారులకు నెలకు రూ. 500/- కు పింఛను రేటును పెంచుతారు. లబ్ధిదారులు గౌరవనీయ స్థాయిలో సహాయాన్ని పొందేందుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మొత్తానికి సమానమైన టాప్ అప్ మొత్తాన్ని అందించవలసిందిగా రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలను ప్రోత్సహిస్తారు. ప్రస్తుతం రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలు ఎన్ఎస్ఏపి పరిధిలోని ఐజిఎన్ఓఎపిఎస్ కింద ఒక్కో లబ్ధిదారుకు నెలకు రూ. 50 నుంచి రూ. 3000వరకు టాప్ అప్ మొత్తాలను జోడిస్తున్నాయి.

ఎన్ఎస్ఏపి పింఛను పథకాల కింద తోడ్పాటును పథకాల వారీ, రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల వారీగా లబ్ధిదారులకు మంజూరు చేస్తారు. ప్రస్తుతం దేశంలో ఐజిఎన్ఓఎపిఎస్ కింద ఉన్న లబ్ధిదారుల సంఖ్య 2.21 కో?ట్లు, అన్ని రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలలో ఈ పథకం దాదాపు 100% సంతృప్త స్థాయిని సాధించింది. ఎన్ఎస్ఏపి పింఛను పథకాలు కింద రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలకు విధించిన క్యాప్‌ను మించి అర్హులైన లబ్ధిదారులు ఉంటే, రాష్ట్రాలు/ కేంద్రప్రభుత్వాలు తమ స్వంత నిధుల నుంచి పింఛన్లను అందించే ప్రత్యామ్నాయం ఉంది.

రాష్ట్ర ఆరోగ్య సేవల బట్వాడా వ్యవస్థ అంటే, ఔట్‌రీచ్ సేవలు సహా ప్రాథమిక, ద్వితీయ, తృతీయ ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన వివిధ స్థాయిలో?ల సీనియర్ సిటిజెన్లకు ఆరోగ్య సంరక్షణ సేవలను అందించే ఉద్దేశంతో అంకితమైన ఆరోగ్య సేవలను అందించేందుకు 2010-11లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కోసం జాతీయ కార్యక్రమం (ఎన్‌పిహెచ్‌సిఇ)ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో రెండు భాగాలు ఉన్నాయి, ఒకటి జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) అంటే ప్రాథమిక, ద్వితీయ శ్రేణి సేవలను జిల్లా ఆసుపత్రులు (డిహెచ్), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సిహెచ్‌సి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పిహెచ్‌సి)లు, సబ్-సెంటర్/ హెల్త్ & వెల్‌నెస్ సెంటర్లు, ఇక మూడవ ఉపకరణంలో సేవలను భారతదేశంలోని 18 రాష్ట్రాలలో గల 19 వైద్య కళాశాలల్లో గల జాతీయ జీరియాట్రిక్ సెంటర్లు (ఆర్‌జిసిలు), ఒకటి న్యూఢిల్లీలోని అన్సారీ నగర్‌లోని ఎఐఐఎంఎస్, మరొకటి మద్రాస్ మెడికల్ కాలేజీలో రెండు నేషనల్ సెంటర్స్ ఆఫ్ ఏజియింగ్ (ఎన్‌సిఎ) సెంటర్లు ఉన్నాయి. సీనియర్ సిటిజెన్ల ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పరిశోధన కూడా ఇందులో ఉంది.

అంతేకాక, 10 కోట్ల మంది (సుమారు 50 కోట్ల మంది లబ్ధిదారు)నిరుపేద, బడుగు బలహీనవర్గాల కుటుంబాలను కవర్ చేసేందుకు ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ - ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (పిఎంజెఎవై)ను ప్రారంభించారు. ద్వితీయ, తృతీయ ఆసుపత్రులలో చికిత్స కోసం చేరేందుకు ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ. 5 లక్షల వరకు కవరేజ్‌ను ఇది అందిస్తుంది. ఆయుష్మాన్ భారత్- పిఎంజెఎవై ప్రారంభంతో, రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన (ఆర్ఎస్‌బివై) , సీనియర్ సిటిజెన్ ఆరోగ్య బీమా పథకం (ఎస్‌సిహెచ్ఐఎస్)ను అందులో కలిపివేశారు. ఆర్ఎస్‌బివై, ఎస్‌సిహెచ్ఐఎస్ పథకాల కింద నమోదు చేసుకున్న లబ్ధిదారు కుటుంబాలన్నీ కూడా ఆయుష్మాన్ భారత్- పిఎంజెఎవై కింద లాభం పొందవచ్చు.

ఈ సమాచారాన్ని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి కుమారి ప్రతిమా భౌమిక్ లోక్‌సభలో మంగళవారం అడిగిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వక రూపంలో సమాధానమిచ్చారు.

# హైదరాబాద్‌లో ఎర్గో ట్రె ఎలక్ట్రిక్ బెడ్‌ను ప్రారంభించిన మాగ్నిఫ్లెక్స్ ఇండియా

హైదరాబాద్, డిసెంబర్ 21, (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ప్రతిష్టాత్మకమైన 60 ఏళ్ల వారసత్వం, ఇటాలియన్ మూలాలు కలిగిన యూరప్‌లోని ప్రముఖ మ్యాట్రెస్ బ్రాండ్‌గా ప్రసిద్ధి చెందిన మాగ్నిఫ్లెక్స్ ఇండియా (మేడ్ ఇన్ ఇటలీ), విప్లవాత్మక 'ఎర్గో ట్రె ఎలక్ట్రిక్ బెడ్'ని తన విభిన్న ఉత్పత్తుల శ్రేణికి జోడించి హైదరాబాద్ మార్కెట్ లోకి విడుదల చేసింది. అధునాతన నిద్ర పరిష్కారాలను అందించడానికి బ్రాండ్ అంకితభావాన్ని ఇది తెలియజేస్తుంది. రిమోట్ కంట్రోల్ ద్వారా నిర్వహించబడే ఈ విలాసవంతమైన, ఆరోగ్య-కేంద్రీకృత బెడ్, వ్యక్తిగతీకరించిన బాడీ సపోర్ట్‌ను అందించడానికి రూపొందించబడిన ఎర్గోనామిక్ ప్లేట్‌లను కలిగి ఉంటుంది. ఈ విస్తరణ అన్ని వయసుల వారికి సమకాలీన నిద్ర ఉపకరణాలలో అభివృద్ధి చెందుతున్న ప్రాధాన్యతలకు అనుగుణంగా వినూత్న పరిష్కారాలను అందించడానికి మాగ్నిఫ్లెక్స్ నిబద్ధతకు అనుగుణంగా ఉంది. తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో కంపెనీ గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా, కంపెనీ ఈ ప్రాంతంలో ఆకట్టుకునే 32% వృద్ధిని సాధించింది. మార్చి 2024 నాటికి అనేక మంది డీలర్లను జోడించడం




ద్వారా తన ఉనికిని పెంచుకోవాలని వ్యూహాత్మకంగా యోచిస్తోంది.

లాన్సెట్ అధ్యయనం ప్రకారం భారతదేశంలో సుమారుగా 87.5 మిలియన్ల మంది దిగువ భాగంలో వెన్నునొప్పితో బాధపడుతున్నారు. కుర్చీల్లో కూర్చొని వంగడం, బోర్లా పడుకొని ల్యాప్‌టాప్‌తో పని చేయడం, బెడ్‌లపై కూర్చోవడం వంటి పేలవమైన భంగిమలు తరచూ ఈ సమస్యకు దీనికి కారణమని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి, మాగ్నిఫ్లెక్స్ ఎర్గో ట్రె ఎలక్ట్రిక్ బెడ్‌ను ఆవిష్కరిం చింది. ఇది వెన్నునొప్పిని తగ్గించడానికి, నిద్ర భంగిమను మెరుగుపరచడానికి రూపొందించబడింది. ఈ సందర్భంగా మాగ్నిఫ్లెక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ నిచాని మాట్లాడుతూ, 'మేం కొత్తగా ఆవిష్కరించిన ఎర్గో ట్రె ఎలక్ట్రిక్ బెడ్ సిల్వర్ బీచ్‌వుడ్‌తో, దృఢమైన సర్దుబాటు చేయగల బేస్‌తో రూపొందించబడిందని తెలిపారు.. ఎర్గోనామిక్ ఆకారపు ప్లేట్‌లతో జోడించబడింది. వినియోగదారులు తల, పాదాల స్థానాలను సర్దుబాటు చేయవచ్చు, వెన్నెముక ఒత్తిడిని తగ్గించవచ్చు. వెన్నునొప్పి, గురక, యాసిడ్ రిఫ్లక్స్, స్లీప్ అప్నియా, వెరికోస్ వెయిన్స్, పాదాల వాపు వంటి సమస్యలను పరిష్కరించవచ్చు" అని అన్నారు

# తప్పులు తడకగా విద్యుత్ శ్వేతపత్రం

## -గణాంకాలతో సహా వివరించిన జగదీష్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 21: దేశంలో 24 గంటల విద్యుత్‌ను అన్ని రంగాల వినియోగదారులకు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయాన్ని నీతి ఆయోగ్ తన స్టేట్ ఎనర్జీ అండ్ క్లైమెట్ ఇండెక్స్‌లో ప్రకటించిందని గుర్తు చేశారు. శాసన సభలో విద్యుత్ రంగంపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో విద్యుత్ పరిస్థితిని ఆయన వివరించారు. 2014 జూన్ 2 నాటికి విద్యుత్ సంస్థల ఆస్తులు 44,438 కోట్లు ఉంటే.. అప్పు 22,423 కోట్లు ఉండేదని జగదీశ్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు ఆ అప్పులు 81,016 కోట్లు అవ్వగా.. ఆస్తుల విలువ 1,37,570 కోట్లకు పెంచామని వివరించారు. తెచ్చిన అప్పుతో ఎక్కడా నష్టం జరగలేదని.. ఆస్తులు పెంచామని వివరించారు. ఆనాడు తెలంగాణ రాష్ట్రంలో పిల్లలకు పరీక్షలు వస్తున్నాయంటే.. పెద్దలకే పెద్ద పరీక్ష ఉండేదని గుర్తు చేశారు. పరీక్షలు వస్తున్నాయంటే కిరసనాయిల్ దేవులాడు కురావడం.. క్యాండిల్స్ కొనుక్కొచ్చుకునే పరిస్థితి ఉండే దన్నారు. ఒకప్పుడు పల్లెల్లో నీళ్లు కావాలంటే బోరు బావుల దగ్గరకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేదన్నారు.అలా బోరుబావి దగ్గరికి పోయాక కరెంటు పోతే.. రెండు గంటలా.. మూడు గంటలనాలుగు గంటలా.. ఎన్ని గంటలు అక్కడే ఉండాలో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. బిందెడు నీళు లేకుండా ఇంటికి పోతే ఎసరు పెట్టే పరిస్థితి లేదని గుర్తు చేశారు. ఆనాడు పరిశ్రమలు, వాణిజ్య రంగం, వ్యాపార రంగం, జనరేటర్ లేని ఏ ఒక్క షాపు, ఇన్వర్టర్ లేని ఇల్లు ఉండేదా.. అని ప్రశ్నించారు. ప్రపంచంలో పారిశ్రామికవేత్తలు ధర్నా చేసిన మొట్టమొదటి సందర్భం సమైక్య పాలనలోనే హైదరాబాద్‌లో జరిగిందని అన్నారు. విద్యుత్ రంగాన్ని అన్ని విధాల బలోపేతం చేశామని, ఆస్తులు పెంచామని పేర్కొన్నారు.. నిరంతరం వెలుగులు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అంటూ తేల్చి చెప్పారు జగదీష్ రెడ్డి.


## కొత్త శీర్షిక ప్రారంభం

### నాకు నచ్చిన కథ

నేటి నిజం దిన పత్రిక సాహితీ కెరటాలులో త్వరలో కొత్త శీర్శిక ప్రారంభిస్తున్నాం.

"నాకు నచ్చిన కథ" శీర్శికలో మంచి కథలనుపాఠకులకు అందించాలనేది లక్ష్యం.

ఈ శీర్శికలో ప్రచురించడానికి ఎవరైనా కథలను సూచించవచ్చు.

అవి పుస్తకాల్లో వచ్చినవైనా పత్రికల్లో వచ్చినవైనా మీకు గుర్తుండి పోయిన కథలు ఈ శీర్శికకు పంపవచ్చు.

ఆ కథ ఎందుకు నచ్చిందో ఆ కథ విశిష్టత ఏమిటో ఒక పేజీ విశ్లేషణ ఆ కథతో పాటు పంపండి

మీకు నచ్చిన కథను డిటిపి చేసి ఒపెన్ ఫైలు, పిడిఎఫ్ పంపి సహకరించడం మీ వంతు. ఎంపిక చేసి ప్రచురించడం మా వంతు. సుప్రసిద్ధ సీనియర్ రచయిత **బి.ఎస్.రాములు** గారు ఈ శీర్షికను నిర్వహిస్తారని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

- సంపాదకులు

'నేటినిజం' దినపత్రిక, మాతృశ్రీ నిలయం
ఎస్.ఆర్.టి.169, జవహర్‌నగర్, హైదరాబాద్-500 020
email: netinizam2020@gmail.com


# మేరీ మాత చర్చిని సందర్శించిన చంద్రబాబు..

అమరావతి, డిసెంబర్ 21: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తన సతీమణి నారా భువనేశ్వరితో కలిసి గుణదల మేరీమాత చర్చికి వెళ్లారు. చర్చిలో ప్రార్థనలు చేశారు. చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి దంపతులకు చర్చి ఫాదర్‌లు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం మేరిమాత విగ్రహాన్ని అందజేశారు.

అంతకు ముందు విశాఖపట్నం నుంచి గన్నవరం విమానాశ్రయం చేరుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అక్కడ నుంచి గుణదల వెళ్లారు. ఈ సమయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారు అని అన్నారు. ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది అని పేర్కొన్నారు.. నవశకం ప్రారంభమైందని యువగళం ప్రపంచానికి చాటింది అని అన్నారు? రాష్ట్రానికి పూర్వ వైభవాన్ని తీసుకొస్తాం అని , . దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఏపీని టీడీపీ-జనసేన కూటమి పునర్నిర్మిస్తుంది అని స్పష్టం చేశారు.

# బిగ్ బాస్ దాడి ఘటనలో మరో 16 మంది అరెస్ట్.!

హైదరాబాద్ డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);బిగ్ బాస్ షోకు సంబంధించి రోజు రోజుకు వివాదం ముదురుతుంది. ఈ షో సీజన్ 7 ముగిసిన అనంతరం జరిగిన దాడి ఘటనపై విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ1గా ప్రశాంత్, ఏ2గా మనోహర్, ఏ3గా అతడి స్నేహిడుతు వినయ్‌ను చేర్చారు. ఇప్పటికే బిగ్‌బాస్-7 విజేత పల్లవి ప్రశాంత్‌తోపాటు అతని సోదరుడు మహావీర్‌ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వైద్య పరీక్షల అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం ఇద్దరికీ 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఇద్దరినీ జూబ్లీహిల్స్ పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.అయితే ఈ దాడి ఘటనపై పోలీసులు తాజాగా మరో 16 మందిని అరెస్ట్ చేశారు. ఆర్టీసి బస్సులు, పోలీసు వాహనాలపై దాడికి పాల్పడిన వారిలో 16 మందిని గుర్తించిన జూబ్లీహిల్స్ పోలీసులు వారిని అరెస్ట్ చేసి కాసేపట్లో కోర్టు ఎదుట హాజరుపరుచనున్నారు. ఇక ఈ 16 మందిలో 12 మంది మేజర్లు కాగా.. నలుగురు మైనర్లు ఉండడం విశేషం.ఈ నెల 17న బిగ్‌బాస్ ఫైనల్ నేపథ్యంలో అన్నపూర్ణ స్టూడియో వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకున్నది. టైటిల్ విజేతగా నిలిచిన ప్రశాంత్ స్టూడియోస్ నుంచి బయటికి రాగా, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అదే సమయంలో రన్నరప్‌గా నిలిచిన అమర్‌దీప్ సైతం బయటకు రాగా, ఇరువురి అభిమానుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కొందరు అనుదీప్ కారుపై రాళ్లు విసిరేందుకు ప్రయత్నించారు. మరో పోటీదారు అశ్విని కారు అద్దాలను పగులగొట్టారు.

# మొత్తం బొగ్గు ఉత్పత్తి ఒక బిలియన్ టన్నులు దాటే అవకాశం ఉంది - మంత్రి ప్రహ్లాద్ జోషి

న్యూఢిల్లీ, డిసెంబర్ 21:దేశీయ బొగ్గు ఉత్పత్తి గణనీయంగా పెరిగినందున 2025 నాటికి విద్యుత్ రంగానికి బొగ్గు దిగుమతి 2 శాతానికి తగ్గుతుందని కేంద్ర బొగ్గు, గనులు మరియు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి అన్నారు. నిన్న ఇక్కడ 9వ రౌండ్ కమర్షియల్ బొగ్గు గనుల వేలం ప్రారంభ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ..బొగ్గు ఉత్పత్తి మరియు ఆఫ్ టేక్‌లో స్వయం సమృద్ధి సాధించడానికి రికార్డ్ పనితీరు కోసం కోల్ ఇండియా లిమిటెడ్ మరియు అనుబంధ కంపెనీలకు శ్రీ జోషి అభినందనలు తెలిపారు. ఈ ఏడాది మొత్తం బొగ్గు ఉత్పత్తి బిలియన్ టన్నులు దాటే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. భారతదేశపు బొగ్గు రంగం నిరంతరం దేశ ఇంధన భద్రతకు దోహదపడుతోందని తద్వారా వేగంగా అభివృద్ధి చెందుతున్న మన ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిస్తోందని చెప్పారు.

భారతదేశం అనుసరిస్తున్న స్థిరమైన బొగ్గు మైనింగ్ పద్ధతులను వివరించిన శ్రీ జోషి..ఉద్గారాలలో దేశం ప్రపంచ అగ్రగామిగా అవతరించిందన్నారు. బొగ్గు గ్యాసిఫికేషన్‌కు 6000 కోట్ల ప్రోత్సాహకం ఇచ్చినట్టు తెలిపారు. స్థిరమైన మైనింగ్‌ను మరింత బలోపేతం చేసేందుకు బొగ్గు పిఎస్‌యులు ఇటీవలి సంవత్సరాలలో 100 మిలియన్ మొక్కలను నాటినట్లు మంత్రి తెలిపారు.

9వ రౌండ్‌లో 26 మరియు 7వ రౌండ్‌లో 2వ ప్రయత్నంలో 5 సహా మొత్తం 31 బొగ్గు గనులు 9వ రౌండ్ వాణిజ్య బొగ్గు గనుల వేలంలో అందించబడ్డాయి. వేలం వేయబడుతున్న గనులు బొగ్గు/లిగ్నైట్-బేరింగ్ రాష్ట్రాలైన జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో విస్తరించి ఉన్నాయి.

భారతదేశం మొత్తం 344.02 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలను కలిగి ఉంది మరియు ప్రపంచంలో రెండవ అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారుగా ఉంది. భారతదేశ విద్యుత్ డిమాండ్‌లో గత కొన్నేళ్లుగా స్థిరమైన పెరుగుదల కనిపిస్తోంది. భారతదేశంలో 72% విద్యుత్తు బొగ్గు నుండి ఉత్పత్తి చేయబడినందున ఇది దేశ అభివృద్ధికి చాలా వ్యూహాత్మక రంగం అవుతుంది.వాణిజ్య బొగ్గు గనుల తవ్వకం దేశానికి కొత్త పెట్టుబడులను తీసుకువస్తుందని మరియు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధిని సృష్టిస్తుందని భావిస్తున్నారు. బొగ్గును కలిగి ఉన్న రాష్ట్రాలైన జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అరుణాచల్ ప్రదేశ్, బీహార్ మరియు అస్సాం రాష్ట్రాల్లో సామాజిక -ఆర్థిక ప్రయోజనాలను తీసుకురావడానికి వేలం ద్వారా వచ్చే మొత్తం ఆదాయం కేటాయించబడుతుంది.

ఇప్పటి వరకు వేలం వేసిన గనుల నుంచి బొగ్గు తవ్వకం ద్వారా ఏటా రూ. ₹33,343 కోట్ల రాబడి వస్తుండగా ₹220.90 ఎంటిపిఏ సముదాయ పీక్ రేట్ కెపాసిటీ స్థాయిలో ఉత్పత్తిని పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ గనులు పూర్తిగా అందుబాటులోకి వస్తే అవి ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా దాదాపు మూడు లక్షల మందికి ఉపాధిని కల్పిస్తాయి. అలాగే ఈ బొగ్గు గనుల నిర్వహణకు రూ. 30,000 కోట్ల పెట్టుబడిని వెచ్చించనున్నారు.

పరిశుభ్రతను సంస్థాగతీకరించడం మరియు పెండింగ్‌ను తగ్గించడం లక్ష్యంగా ప్రత్యేక ప్రచారం 3.0లో భాగంగా బొగ్గు మరియు లిగ్నైట్ గనులు అనూహ్యంగా పనిచేసిన వారికి స్టార్ రేటింగ్ అవార్డులను మరియు బొగ్గు సిపిఎస్ఈలకు వివిధ విభాగాల్లో సర్టిఫికేట్‌లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అమృత్ లాల్ మీనా ప్రసంగిస్తూ ఫైవ్‌స్టార్ రేటింగ్‌లు సాధించిన బొగ్గు గనులకు అభినందనలు తెలియజేసారు. బొగ్గు ఉత్పత్తి ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. బొగ్గు మరియు లిగ్నైట్ మైనింగ్ రంగంలో అత్యుత్తమ పనితీరుకు ఈ గుర్తింపు ఉత్ప్రేరకంగా పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు.అదనపు కార్యదర్శి & నామినేటెడ్ అథారిటీ శ్రీ ఎం నాగరాజు స్థిరమైన బొగ్గు ఉత్పత్తిని నిర్ధారించడానికి మంత్రిత్వ శాఖ చేపట్టిన వివిధ సంస్కరణలను హైలైట్ చేశారు.

గనుల మధ్య పోటీతత్వాన్ని పెంపొందించడం మరియు బాధ్యతాయుతమైన మైనింగ్ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా దేశంలో బొగ్గు మరియు లిగ్నైట్ మైనింగ్ పనితీరు మరియు స్థిరత్వాన్ని పెంపొందించడానికి స్టార్ రేటింగ్ విధానాన్ని ప్రభుత్వం 01.04.2019 నుండి ఆమోదించింది. ఈ విధానం బొగ్గు మరియు లిగ్నైట్ మైనింగ్‌లో పనితీరు మరియు స్థిరత్వ ప్రమాణాలను గణనీయంగా పెంచింది, దేశవ్యాప్త భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుంది. స్టార్ రేటింగ్‌లు ఫైవ్ స్టార్ నుండి నో స్టార్ వరకు ఉంటాయి. ప్రతి గని విజయాలను మూడు విభాగాలలో సమగ్రంగా అంచనా వేస్తుంది: భూగర్భ గనులు (యూజీ), ఓపెన్‌కాస్ట్ మైన్ (ఓసీ) మరియు మిశ్రమ గనులు. ఓపెన్ కాస్ట్ మైన్స్‌లో మొత్తం 50 మూల్యాంకన పారామితులు మరియు భూగర్భ గనులలో 47 ఈ ఏడు మాడ్యూళ్లలో పేర్కొనబడ్డాయి.గత నాలుగు సంవత్సరాలలో (2018-19, 2019-20, 2020- 21, 2021- 22) మొత్తం 68 గనులు 5-స్టార్ రేటింగ్‌కు అర్హత సాధించాయి. 91% కంటే ఎక్కువ స్కోర్ సాధించి 39 గనులు 1వ, 2వ, 3వ స్థానంలో నిలిచాయి.బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రజా ఫిర్యాదులు, పిఎంఓ సూచనలు, సిఎంఓ సూచనలు మరియు ఐఎంసీ విషయాలను పరిష్కరించడంలో 100% విజయవంతమైన రేటును సాధించడం ద్వారా ప్రత్యేక ప్రచార 3.0ని విజయవంతంగా పూర్తి చేసింది.

# శ్రీనివాస రామానుజన్ నేటి తరానికి గొప్ప మార్గదర్శకులు

**– అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత అధినేత డా॥ వి నరేందర్ రెడ్డి**
**–అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్ లో మాథ్స్ మెజెస్టి వేడుకలు**




కరీంనగర్, డిసెంబర్ 21:(నేటి నిజం ప్రతినిధి) కరీంనగర్ పట్టణం లోని స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్ లో గురువారం మాథ్స్ మెజెస్టి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత అధినేత డా॥ వి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ నేటి తరానికి గొప్ప మార్గదర్శకులని, నూతన అధ్యాయానికి నాంది పలికిన మహనీయుడని కొనియాడారు. విద్యార్థులకు గణిత శాస్త్రంలోని విషయాలతో పాటు వివిధ నమూనాల పట్ల సమగ్రమైన అవగాహన కల్పించి, వాటిలో కొత్త విషయాలను తెలుసుకోవల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఈ విదంగా చేయడం వలన ఇతరులపై పైచేయి సాధిస్తారని, ఉత్తమంగా ఖ్యాతి ఘడిస్తారని చెప్పారు. ప్రత్యేకంగా విషయాలలో పట్టు పొందడానికై, సృజనాత్మకతను పెంపొందించు కోవడానికై వివిధ అంశాలలో పట్టు సాధించడం అనివార్యం అని చెప్పారు. అదే విధంగా భారతదేశ గణిత శాస్త్రంలో చిన్నతనం నుండే నూతన ఆవిశ్కరణలకు నాంది పలికినటువంటి మహనీయుడు శ్రీనివాస రామానుజన్ గుర్తు చేశారు. నేటికి వారు ప్రవేశపెట్టినటువంటి సూత్రాలు, పలు అంశాలు పలు దేశాలలో నేటికి అమలులో ఉండడం వారి కృషికి నిదర్శనం అని చెప్పారు. విద్యార్థులు తల్లిదండ్రులు నిర్దేశించిన విషయాలను క్రమం తప్పకుండా పాటించి ఘన విజయాల వైపు పయనించాలని కోరారు. గణిత శాస్త్రంలోని విషయాలు తూచా తప్పకుండా తెలుసుకొని కొత్త విషయాలను కనుగొని ఉత్తమంగా ముందుకు పయనించి విజయవంతం కావాలని చెప్పారు.

ఉత్సవాలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి "మ్యాజిక్ మ్యాట్రిక్స్, రోబో సర్కిల్, క్యూబ్ బిల్డింగ్, పలు నమూనాలు చాలా ఆలోచింపచేశాయి. రామానుజన్ దేశానికే ఆదర్శప్రాయుడు, నాటికలు అబ్బురపరచాయి. విద్యార్థులు ఆలపించినటువంటి "సూర్యుడివో... చంద్రుడివో...", "లెక్కలు చెప్పాడు మాష్టారు లెక్కలు చూశాడు విద్యార్థి", "భలే భలే లెక్కలు" గేయాలు ఉత్సాహాన్ని నింపాయి. సుమారు 200 మంది విద్యార్థులు వివిధ ఆకర్షనీయ నమూనాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏపీ ప్రభుత్వం, వైసీపీ నాయకులపై మండిపడ్డ పవన్‌కళ్యాణ్

విశాఖపట్నం డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఏపీ ప్రభుత్వం, వైసీపీ నాయకులపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. విశాఖపట్నం కేంద్రంగా వైసీపీ ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు చేస్తున్న అక్రమాలు, చట్ట ఉల్లంఘనలపై న్యాయ పోరాటం చేస్తున్న తమ పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌ను చంపేస్తామని బెదిరించడం అధికార పక్షం వైఖరిని తెలియజేస్తుందని అన్నారు. ప్రశ్నించడం, చట్ట ఉల్లంఘనలపై పోరాడటం ప్రజాస్వామ్యంలో భాగమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం పట్ల గౌరవం లేని పాలకులు, వారి అనుయాయులు న్యాయ పోరాటాలను తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. అందుకే ప్రాణహానికి తలపెట్టారని ఆరోపించారు. విశాఖపట్నంలో రుషికొండను తొలిచేసి ప్యాలెస్ నిర్మించడంపై, దసపల్లా భూముల వ్యవహారం, టీడీఆర్ స్కామ్, టైకూన్ కూడలి మూసివేత, క్రైస్తవ ఆస్తులను కొల్లగొట్టి భారీ భవనాలు నిర్మించడం వంటి వైసీపీ చేస్తున్న అనేక అక్రమాలపై మూర్తి యాదవ్ పోరాడుతున్నారని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. జీవీఎంసీలో చోటు చేసుకుంటున్న అవినీతి చర్యలు, తప్పుడు ర్యాటిఫికేషన్లపై కౌన్సిల్ సమావేశాల్లో బలంగా మాట్లాడుతున్నారని తెలిపారు. ఆయనకు జనసేన పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. మూర్తి యాదవ్‌కు ప్రాణహాని తలపెట్టిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డీజీపీ, విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆయనకు ఏ చిన్నపాటి హాని కలిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.

# మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

**–వేములవాడ రూరల్ తహసీల్దార్ డి సుజాత**




రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 21:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మండలం అగ్రహారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్లలో 2023–24 విద్యా సంవత్సరానికి బ్యూటీ అండ్ కాస్మటాలజీ సర్టిఫికెట్ కోర్సుని వేములవాడ రూరల్ తహసీల్దార్ డి సుజాతగురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ తహసీల్దార్ శ్రీమతి డి సుజాత ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రతిష్టాత్మక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్ల అద్భుతమైన ప్రగతి సాధిస్తున్నదని, ఈ కళాశాలలో రోజురోజుకు విద్యార్థుల యొక్క సంఖ్య సుమారు 610 వరకు చేరుకోవడానికి కారణమైన ప్రిన్సిపల్ ని అభినందించారు. ఈ కళాశాలలో సాధారణ కోర్సులే కాకుండా విద్యార్థినిలు తమ జీవితంలో సొంత కాళ్లపై నిలబడడానికి, భవిష్యత్తులో ఆర్థిక స్వాతంత్ర్యం, ఆత్మవిశ్వాసం పెంచే ఉద్దేశంతో కళాశాలలో మూడు నెలల బ్యూటీ అండ్ కాస్మటాలజీ కోర్సు 2వ బ్యాచ్ ని రోజా ఇండస్ట్రీస్ చైర్మన్ సాక శైలజ సహకారంతో ప్రిన్సిపాల్ ఈ కోర్సును ప్రారంభించడం అభినందనీయమని తెలిపారు.

అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వద్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల గత ఐదు సంవత్సరాలుగా ఎంతో అభివృద్ధి సాధించిందని, కళాశాలలో చేరడానికి విద్యార్థులు పోటీ పడుతున్నారని తెలిపారు. కళాశాలలో ఇప్పటివరకు 300 మంది విద్యార్థినిలు చదువుకుంటున్నారని తెలిపారు. ఈ విద్యార్థినిలు భవిష్యత్తులో మంచి మంచి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, వారు భవిష్యత్తులో ఆర్థిక స్వాతంత్రం పొందుతూ సమాజంలో ఒక గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రోజా ఇండస్ట్రీస్ డైరెక్టర్ అండ్ చైర్మన్ సాక శైలజ కోర్సుకు సంబంధించిన సమగ్ర వివరాలను కూలంకషంగా వివరించారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో స్వయం ఉపాధి ద్వారా స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ ఎం రమాదేవి, సహ కోఆర్డినేటర్ డాక్టర్ కే వై కరుణ కోర్సుకు సంబంధించిన ముఖ్య సమాచారం విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, కోర్సు సమన్వయకర్తలు డాక్టర్ ఎన్ రమాదేవి, డాక్టర్ కేవై కరుణ, ఉమన్ ఎంపవర్మెంట్ సెల్ సమన్వయకర్త డాక్టర్ అఫ్సారీ ఉస్మానీ, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ వి వెంకటేశ్వర్లు, అకాడమిక్ కోఆర్డినేటర్ మధు రాజేష్, ఏవో అంజాద్ అలీ, అధ్యాపకులు డాక్టర్ మల్లారెడ్డి, కె రాజేష్, డాక్టర్ నీలం శ్రీనివాసులు, డాక్టర్ ఎం ప్రభాకర్, వై నారాయణ, నర్సయ్య, మధుబాబు, దీపిక, డాక్టర్ అర్జున్, ఫకీర్ బాబా, రమేష్ బాబు విద్యార్థులు పాల్గొన్నారు.

# మతపరమైన విద్వేషాలు చిమ్మడమే బిజెపి లక్ష్యం

**-సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు తబ్లీగ్ జమాత్ కృషి**
**-సమాజ హితం కోసం పాటుపడే తబ్లీగ్ జమాత్ పై అవగాహన లేకనే బండి సంజయ్ విమర్శలు**
**-తక్షణమే బండి సంజయ్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి**
**-ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ డిమాండ్**




కరీంనగర్, డిసెంబర్ 21:(నేటినిజం ప్రతినిధి) మతపరమైన విద్వేషాలను చిమ్ముతూ ప్రజల మధ్య వైశ్యామ్యాలను రగిలించి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడడమే బిజెపి పార్టీ పని అని అందులో భాగంగానే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అవగాహన లేక తబలీగ్ జమాత్ పై నిరాదరమైన ఆరోపణలు చేశారని ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ విమర్శించారు. గురువారం గులాం అహ్మద్ ఒక ప్రకటనలో ఈ విధంగా పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు, ప్రజల్లో శాంతి నెలకొల్పేందుకు, చెడు మార్గంలో పయనించే వారిని మంచి మార్గంలో తీసుకొచ్చేందుకు, దేశ హితం కోసం, సమాజ హితం కోసం విశేషంగా కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వపరంగా అన్ని మతాలకు ప్రాధాన్యత కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. అన్ని వర్గాలను ప్రోత్సహించడం కోసం సెక్యులర్ ప్రభుత్వాలు కృషి చేస్తుంటే చూసి ఓర్వలేక బండి సంజయ్ కుళ్ళు, కుటిల బుద్ధితో విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. దేశంలో విపత్తులు వచ్చినప్పుడు తబ్లిగ్ జమాత్ ముందుండి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, మొన్నటికి మొన్న కరోనా ఆపత్కాలంలో కుల, మతాలకతీతంగా కరోనాతో చనిపోయిన వారి అంత్యక్రియలు తబ్లిగ్ జమాత్ చేసిందని గుర్తు చేశారు. బండి సంజయ్ తో పాటు బిజెపి నేతలు ముస్లిం సంస్థలపై ముస్లింలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని అందుకే తెలంగాణలో బిజెపి పార్టీకి అన్ని వర్గాల ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినప్పటికీ ఇంకా బుద్ధి రావడం లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా బండి సంజయ్ తబలి జమాత్ పై చేసిన అసంబద్ధమైన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తిరిగి బిజెపికి గట్టి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# స్టార్ మా లో మళ్ళీ ప్రారంభం కాబోతోన్న "సూపర్ సింగర్"

**-ప్రతి శనివారం, ఆదివారం రాత్రి 9 గంటలకు ప్రేక్షకుల్ని అలరించబోతోన్న"సూపర్ సింగర్"**




హైదరాబాద్ డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సింగింగ్ షో లలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకుని, ఎన్నో అద్భుత స్వరాలను పరిచయం చేసిన "సూపర్ సింగర్" ఇప్పుడు స్టార్ మా లో మరింత వినూత్నంగా మళ్ళీ ప్రారంభం కాబోతోంది. విభిన్నమైన ఆలోచనతో, విలక్షణమైన వాయిస్ లతో సర్వం సిద్ధం చేసుకుంది. షో కోసం ఆడిషన్స్ నిర్వహించి,.. వాటి నుంచి వడపోసిన స్వరాలు ప్రేక్షకులు ఆస్వాదించబోతున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాక అమెరికా నుంచి, కేరళ నుంచి వచ్చి పాటల మీద, సంగీతం మీద ఆసక్తితో, నిరూపించుకోవాలన్న ఆకాంక్షతో కంటెస్టెంట్స్ పాల్గొనేందుకు రావడం ఈ షో ప్రత్యేకత. మాటల సెలయేరు, హావభావాల పూలతేరు శ్రీముఖి ఈ షో ని ప్రెజెంట్ చేస్తున్నారు. నలుగురు విభిన్నమైన ప్రతిభ గల న్యాయమూర్తులు ఈ సారి కంటెస్టెంట్స్ ని తీర్చిదిద్దడమే కాదు.. వారి పాటల పాటవాన్ని నిర్ణయించబోతున్నారు. పోటీని మరింత రసవత్తరంగా నడిపించబోతున్నారు. కమ్మని బాణీకి తన తియ్యని స్వరాన్ని చేర్చి పాటని అందమైన అనుభవంగా తీర్చిదిద్దే గాయని శ్వేతా మోహన్ ; జానపదాన్ని, సినిమా గీతాన్ని సమంగా తన విలక్షణమైన గొంతుతో పలికించి గుండెల్ని ఊయలలూగిస్తున్న మంగ్లీ ; అకాడెమి అవార్డుల వేదిక పైన తన బలమైన వినూత్న స్వరాన్ని వినిపించిన యువ స్వరం రాహుల్ సిప్లిగంజ్; అందమైన సాహిత్య స్పర్శ తో సందర్భానికి సముచితమైన, ఘనమైన స్థానాన్ని ఇచ్చే గేయ రచయిత అనంత శ్రీరామ్ – ఈ సారి న్యాయ నిర్ణేతలు. 20 మంది కంటెస్టెంట్స్ తో ప్రారంభం కాబోతున్న ఈ షో లో 16 మందితో అసలైన పోటీ మొదలవుతుంది. ఈ నెల 23 నుంచి.. ప్రతి శనివారం, ఆదివారం రాత్రి 9 గంటలకు "సూపర్ సింగర్" సంగీతాభిమానుల్నే కాదు.. ప్రతి "స్టార్ మా" ప్రేక్షకుల్ని అలరించబోతోంది. షో నిర్వహణలో ఈ సారి స్టార్ మా ఓ కొత్త ఆలోచనతో ముందుకొచ్చింది. కంటెస్టెంట్స్, వాళ్ళని తీర్చిదిద్దే జడ్జెస్, మార్కులు.. ఇవి మాత్రమే కాకుండా షో ని ఇంకా ఇంటరెస్టింగ్ గా మలచబోతున్న ఆ విషయం ఏంటో తెలుసుకోవాలంటే స్టార్ మా లో సూపర్ సింగర్ చూడాల్సిందే. తప్పక చూడండి – "స్టార్ మా" లో సూపర్ సింగర్.

# సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల కోసం పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్ళు

విజయవాడ /హైదరాబాద్ డిసెంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు శుభవార్త తెలిపింది. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల కోసం పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లను పొడిగించింది. తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్ద పండుగల్లో ఒకటైన సంక్రాంతి పండుగ జనవరి రెండోవారంలో ఉన్నందున పలు రైల్వే స్టేషన్ల మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. పండుగ నేపథ్యంలో అధిక సంఖ్యలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా పది ప్రత్యేక రైళ్లను పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ రైల్ సర్వీసులు జనవరి 5 నుంచి ఫిబ్రవరి 1 వరకు టైమ్‌టేబుల్ వారీగా రాకపోకలు కొనసాగిస్తాయని వెల్లడించారు. తిరుపతి–అకోలా, పూర్ణ–తిరుపతి, హైదరాబాద్– నర్సాపూర్, తిరుపతి– సికింద్రాబాద్, కాకినాడటౌన్– లింగంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

## గుడిసెవాసులకు పునరావాసం కల్పిస్తాం : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 21: రోడ్డు విస్తరణలో గుడిసెలు కోల్పోతున్న బాధితులకు అండగా ఉంటానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా హయత్‌నగర్ రేడియో స్టేషన్ ప్రధాన రహదారిపై నివసిస్తున్న వారి గుడిసెలను తొలగించడం పట్ల ఎమ్మెల్యే గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు.

గతంలో ఆటోనగర్ క్రీడా ప్రాంగణం వద్ద ఉన్న సమయంలో గుడిసెవాసుల సమస్యలను పరిష్కరించానని గుర్తు చేశారు. ఆటోనగర్‌లో అంతర్జాతీయ బస్ టెర్మినల ప్రతిపాదనలో భాగంగా గుడిసెవాసులను హయత్‌నగర్ రేడియో స్టేషన్ వద్దకు తరలించారని తెలిపారు. రేడియో స్టేషన్ వద్ద కరెంటు సౌకర్యం, మూత్రశాలలు, మంచినీరు,వీధి దీపాలు , వీధి వ్యాపారుల లైసెన్స్‌లు ఇప్పించావన్నారు. జాతీయ రహదారి విస్తరణలో గుడిసెలు తొలగిస్తే వారికి పునరావాసం కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతానని పేర్కొన్నారు.

# రోడ్ ట్రిప్‌ల నుండి విదేశీ విహారాల వరకు

## ఈ సెలవు సీజన్‌లో ప్రయాణంలో ఆదా చేసుకోవడానికి క్రెడిట్ కార్డ్‌లు మీకు ఎలా సహాయపడతాయి

హైదరాబాద్, డిసెంబర్ 21:ట్రావెల్ క్రెడిట్ కార్డ్ వినియోగదారులకు ఎయిర్ మైళ్లు, ఉచిత విమానాలు, హోటల్ బసపై గణనీయమైన తగ్గింపు, కాంప్లిమెంటరీ ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ మరియు హోటల్ లాయల్టీ ప్రోగ్రామ్‌లకు సభ్యత్వం వంటి అనేక ఇతర ప్రయాణ ప్రయోజనాలను పొందడంలో సహాయపడుతుంది. కానీ, అనేక ఎంపికలు అందుబాటులో ఉన్నందున, మీ కోసం ఉత్తమమైన ట్రావెల్ కార్డ్‌ను ఎంచుకోవడం మాత్రం కాస్త కష్టమే ! మీరు ప్రత్యేకంగా వెతుకుతున్నది మీకు తెలిస్తే, మీ ప్రయాణ ప్రాధాన్యతలకు సరిపోయే మరియు గరిష్ట విలువను అందించే సరైన కార్డ్‌ని మీరు కనుగొనవచ్చు. కో–బ్రాండెడ్ లేదా జనరల్ ట్రావెల్ కార్డ్ ల నుండి ఎంచుకోండివిమానయాన సంస్థలు, హోటల్ చైన్‌లు లేదా ట్రావెల్ పోర్టల్‌ల సహకారంతో అనేక ట్రావెల్ క్రెడిట్ కార్డ్‌లు అందించబడతాయి. అయితే, అటువంటి కార్డ్‌లపై పొందిన రివార్డ్‌లు సాధారణంగా అనుబంధిత బ్రాండ్‌తో మాత్రమే రీడీమ్ చేయబడతాయి. మరోవైపు, సాధారణ ప్రయాణ క్రెడిట్ కార్డ్‌లు, బ్రాండ్‌కు పరిమితం చేయకుండా విమాన టిక్కెట్‌లు లేదా హోటల్ బస వంటి ప్రయాణ ఖర్చులను తగ్గించుకోవడానికి మీకు మరింత సౌలభ్యాన్ని అందిస్తాయి. అధిక–వ్యయం చేసేవారు అధిక రివార్డ్‌లు మరియు మైలురాళ్ల ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకోవాలి చాలా ట్రావెల్ క్రెడిట్ కార్డ్‌లు రివార్డ్ పాయింట్‌లు లేదా ఎయిర్ మైల్స్ రూపంలో వాల్యూ–బ్యాక్‌ను అందిస్తాయి, ఇది ఒక్కో కార్డుకు భిన్నంగా ఉంటుంది. తమ క్రెడిట్ కార్డ్‌లపై ఎక్కువ ఖర్చు పెట్టే వినియోగదారులు అధిక రివార్డ్ రేట్‌తో ట్రావెల్ కార్డ్ కోసం వెతకాలి. ప్రయాణ ప్రోత్సాహకాలను పరిగణనలోకి తీసుకోండిట్రావెల్ క్రెడిట్ కార్డ్‌లు కాంప్లిమెంటరీ ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్, తక్కువ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్క్–అప్ ఫీజు, డాక్యుమెంట్ల నష్టాన్ని కవర్ చేసే ప్రయాణ బీమా, చెక్–ఇన్ లగేజీ మొదలైన అదనపు ప్రయోజనాలను కూడా అందిస్తాయి. ట్రావెల్ క్రెడిట్ కార్డ్‌ని ఎంచుకునే ముందు, మీరు తప్పనిసరిగా ఈ అదనపు ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, సరైన రివార్డ్‌లు మరియు అదనపు ప్రయోజనాల కలయికను అందించేదాన్ని ఎంచుకోవాలి.సరైన ఇంధన క్రెడిట్ కార్డ్‌తో రోడ్డు ప్రయాణాలను చౌకగా చేయండిట్రావెల్ కార్డ్‌లు ఎక్కువగా ఎయిర్‌లైన్ కార్డ్‌లకు పర్యాయపదాలుగా ఉంటాయి కాబట్టి, రోడ్ ట్రిప్ మరియు వారాంతపు విహారయాత్రలను ఇష్టపడే ప్రయాణికులు ఇంధన క్రెడిట్ కార్డ్ నుండి గణనీయమైన విలువను పొందవచ్చు.చివరగా , ఏ ట్రావెల్ కార్డ్ సరైనది అనే నిర్ణయం మీ ప్రయాణ అలవాట్లు మరియు ట్రావెల్ కార్డ్‌లో మీరు వెతుకుతున్న ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుంది. ఎంపికలను సరిపోల్చండి మరియు మీ అవసరాలకు ఉత్తమంగా సరిపోయే, గరిష్ట విలువను తిరిగి ఇచ్చే దాన్ని ఎంచుకోండి.

# మిచిగాన్ బాధితులకు 'బ్రిడ్జ్‌స్టోన్' సహాయం- రూ. 23 లక్షల విలువైన రిలీఫ్ కిట్‌ల పంపిణీ



హైదరాబాద్, డిసెంబర్ 21:టైర్ల తయారీ, మొబిలిటీ సొల్యూషన్స్‌లో గ్లోబల్ లీడర్‌గా ఉన్న బ్రిడ్జ్‌స్టోన్ కార్పొరేషన్లోని అనుబంధ సంస్థ బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా.. ఆంధ్రాలో మిచిగాన్ తుఫానుతో ప్రభావితమైన వారికి సహాయం అందించడానికి ఆంధ్రప్రదేశ్‌లోని నవజీవన్ ఆర్గనైజేషన్‌తో చేతులు కలిపింది. బాధితులకు రిలీఫ్ కిట్‌ల కోసం రూ. 23 లక్షలను కేటాయించింది. ఈ తుపాను వల్ల అధికంగా నష్టపోయిన నెల్లూరు, తిరుపతి జిల్లాలపై దృష్టి సారించింది. వృద్ధాలను సేకరించేవారు, పారిశుధ్య కార్మికులు, మాన్యువల్ స్కావెంజర్లు, సెక్స్ వర్కర్లకు మద్దతుగా నిలిచింది. బ్రిడ్జ్‌స్టోన్ ఇండియాకు చెందిన 20 మంది ఆంధ్రా ఉద్యోగులు ఈ ప్రాంతంలో సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొన్నారు.

నవజీవన్ ఆర్గనైజేషన్, బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా మద్దతుతో ఫ్యామిలీ సర్వైవల్ కిట్‌లను పంపిణీ చేశారు.

కిరాణా, రోజువారీ వస్తువులతో కూడిన కిట్‌లు ఇచ్చారు. ఈ ఫ్యామిలీ సర్వైవల్ కిట్‌లు తీవ్రంగా ప్రభావితమైన వారి అత్యవసర అవసరాలను తీర్చడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ సహాయక చర్యలతో ఆయా కుటుంబాలకు సాంత్వన చేకూర్చడమే లక్ష్యం. బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా, నవజీవన్ ఆర్గనైజేషన్ మధ్య ఈ భాగస్వామ్యం కంపెనీ దృఢ నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది.

# కరీంనగర్లో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం, కబ్జాలపై భగ్గుమన్న బిజెపి శ్రేణులు..

**–కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన...**
**–భూ బకాసురుల నుండి కరీంనగర్ ను రక్షించాలి.**




కరీంనగర్, డిసెంబర్ 21:(నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ అసెంబ్లీ పరిధిలో అన్యాక్రాంతమవుతు, కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేస్తూ బిజెపి కరీంనగర్ అసెంబ్లీ బిజెపి శ్రేణులు కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నేతలు మాట్లాడుతూ కరీంనగర్ అసెంబ్లీ పరిధిలోని తీగల గుట్టపల్లి, బొమ్మకల్, కొత్తపల్లి, బావు పేట, ఎలగందుల తో పాటు పట్టణంలోని అనేక ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతూ కబ్జాకు గురవుతున్నాయని ఆరోపించారు. లోగడ బిఆర్ఎస్ ప్రభుత్వ అండదండలతో బిఆర్ఎస్ నేతలు కొందరు కరీంనగర్ అసెంబ్లీ పరిధిలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కబ్జా చేశారనన్నారు. భూ కబ్జాలకు పాల్పడిన బి ఆర్ ఎస్ నేతల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు మెతక వైఖరి ప్రదర్శిస్తుందనన్నారు. ప్రధానంగా సీతారాంపూర్ లోని 71 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమి అంశం వివాదాస్పదంగా మారిన నేటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారులు ఇప్పటికైనా అలసత్వం విడాలని, అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను రక్షించడానికి , భూ బకాసురుల నుండి కరీంనగర్ ను కాపాడడానికి తగిన చర్యలు చేపట్టాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇట్టి నిరసన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపురమేష్, మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణ రావు, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ , జిల్లా అధికార ప్రతినిధులు బొంతల కళ్యాణ్ చంద్ర ,జానపట్ల స్వామి, సుధాకర్ పటేల్, ఎడమ సత్యనారాయణ రెడ్డి, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, కార్పొరేటర్లు పెద్దపల్లి జితేందర్, కోలగాని శ్రీనివాస్, దురిశెట్టి అను ప్, చొప్పరి జయశ్రీ, నాగసముద్రం ప్రవీణ్, బండ రమణారెడ్డి, ఎన్నం ప్రకాష్, మాజి ఎంపీపీ వాసాల రమేష్ , పాదం శివరాజ్, పురం హరి ,లడ్డు ముందడ, శ్రీనివాస్, అనిల్, బల్బీర్ సింగ్, లడ్డు ముందడ, రమణ , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో 'కోన్ ఎలివేటర్ ఇండియా' కార్యాలయం ప్రారంభం




హైదరాబాద్, డిసెంబర్ 21: 'కోన్ ఎలివేటర్ ఇండియా' వరంగల్ లో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి సమక్షంలో ఈ కార్యాలయం ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. కోన్ కార్పొరేషన్ పూర్తి యాజమాన్యం లోని అనుబంధ సంస్థే ఈ కోన్ ఎలివేటర్ ఇండియా.. ఈ సందర్భంగా కోన్ ఎలివేటర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ గోస్సేన్ మాట్లాడుతూ తెలంగాణలో వరంగల్ అనేది చారిత్రక నగరం అన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి కేవలం 150 కి.మీ దూరంలో ఉందన్నారు. ఈ కార్యాలయం తెలంగాణ రాష్ట్రంలో యాక్సెసిబిలిటీ, మొబిలిటీ సొల్యూషన్‌లను పెంపొందించడానికి కోన్ నిబద్ధతను సూచిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఇది రెండో అతిపెద్ద నగరమన్నారు. తెలంగాణలో ప్రపంచ స్థాయి ఎలివేటర్, ఎస్కలేటర్ సొల్యూషన్‌లను అందించడం ద్వారా ఈ ప్రాంతం పురోగతికి తోడ్పడుతోందని తెలిపారు. వరంగల్‌లోని ఈ కార్యాలయం తెలంగాణలోని మిగిలిన ప్రాంతాలలో ముఖ్యంగా కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్, నల్గొండలో మా వినియోగదారులకు సేవలను అందించే సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. తెలంగాణలోని ఖాతాదారుల ప్రత్యేక అవసరాలను తీర్చేందుకు రూపొందించిన అనేక రకాల ఉత్పత్తులు, సేవలను అందిస్తున్నామని తెలిపారు.

ఈ ప్రాంతంలో రవాణా పరిష్కారాల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి వరంగల్ కార్యాలయం వ్యూహాత్మకంగా ఉందన్నారు. నైపుణ్యం కలిగిన నిపుణుల బృందం, అత్యాధునిక సౌకర్యాలతో కోన్ ఎలివేటర్ ఇండియా ఈ పరిసర ప్రాంతాలలో ప్రమాణాలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. వరంగల్‌లో కొత్త కార్యాలయం వ్యాపార కార్యకలాపాల విస్తరణకు మాత్రమే కాకుండా స్థానిక కమ్యూనిటీతో లోతైన ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అమర్ శాఖమూరి, క్రెడాయ్ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్త శీర్షిక

**ఈ వారం కొత్త కథ**

త్వరలో నేటి నిజం దిన పత్రికలో
**'ఈ వారం కొత్త కథ'** శీర్షిక
ప్రారంభిస్తున్నాము.
మీ కథలు యూని కోడ్ ఫాంటులో గాని,
డిటిపి చేసి ఒపెన్, ఫైలుతో పాటు
పిడిఎఫ్ ఫైల్ గాని పంపండి.
ప్రచురించిన కథకు విశాల సాహితి
**300 రూపాయలు** పారితోషికం.
బహుమతిగా అందజేస్తుంది.
ఈ శీర్షిక నిర్వహించుటకు
సుప్రసిద్ధ సీనియర్ రచయిత
**బి. ఎస్.రాములు**గారు అంగీకరించారు.
–సంపాదకులు

'నేటినిజం' దినపత్రిక, మాతృశ్రీ నిలయం
ఎస్.ఆర్.టి. 169, జవహర్‌నగర్, హైదరాబాద్–500 020
email: netinizam2020@gmail.com

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com